epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

SAMAYAM

సంపుటి: 19 | సంచిక: 58 | ఎడిటర్ : విక్రం కుమార్ | బుధవారం 10 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131




# సమ్మిట్ సక్సెస్

## అట్టహాసంగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' సదస్సు

- తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ విడుదల
- సీఎం రేవంత్‌పై ఆనంద్ మహీంద్ర ప్రశంసలు
- విజన్ అద్భుతంగా ఉందన్న మాజీ ఆర్‌బీఐ గవర్నర్

**హైదరాబాద్, డిసెంబర్ 9:** భారత్ ఫ్యూచర్ సిటీలో అత్యంత వైభవంగా నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' విజయవంతంగా ముగిసింది. రెండురోజుల పాటు అత్యంత ప్రతిష్టాత్మకంగా దీనిని నిర్వహించారు. ఈ అంతర్జాతీయ స్థాయి సమ్మిట్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా అండ్ మహీంద్రా చైర్‌పర్సన్ ఆనంద్ మహీంద్రా పాల్గొని సీఎం రేవంత్ రెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి దిశ, విజన్ డాక్యుమెంట్ ఆయనను బాగా ఆకట్టుకుందని వెల్లడించారు. సమ్మిట్ వేదికపై మాట్లాడిన ఆనంద్ మహీంద్రా టెక్నాలజీ ఎంత వేగంగా ఎదిగినా, డిజిటలైజేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంత విస్తరించినా హ్యూమన్ టచ్‌కు ఉన్న ప్రాధాన్యత ఎప్పటికీ తగ్గదన్నారు. మానవీయ నైపుణ్యాన్ని ఏ సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా హ్యూమన్ స్కిల్స్‌కు కీలక పాత్ర ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన విజన్ డాక్యుమెంట్‌ను పరిశీలించిన తర్వాత లక్ష్యాలను మరింత విస్తృతంగా, పెద్ద స్థాయిలో పెట్టుకోవాలని అనిపించిందని ఆనంద్ మహీంద్రా తెలిపారు. మిగతా 2 లో

## రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం



- రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు
- సీఎం రేవంత్ సమక్షంలో పలు కంపెనీల ఒప్పందాలు



## ఉద్యోగాల కల్పనే లక్ష్యం

అందుకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి
ఏఐ సిటీ, హెల్త్ సిటీ, స్పోర్ట్స్ హబ్ అభివృద్ధి
ఐటీ మంత్రి శ్రీధర్ బాబు 2

## స్కూళ్లకు 6 రోజుల సెలవు 2



## టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు
ఒక్కో పరీక్షకు మూడురోజుల గ్యాప్
.. వివరాలు 2లో



## రాజ్యాంగాన్ని గుప్పిట్లో పెట్టుకునే కుట్ర

ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి రాజ్యాంగ వ్యవస్థలు
సర్‌పై చర్చలో రాహుల్ ఘాటు విమర్శలు
.. వివరాలు 2లో



## తెలంగాణలో చలి పంజా

గణనీయంగా పెరిగిన చలి తీవ్రత
సాధారణంకంటే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు 2

## మరోసారి బాంబు బెదిరింపులు

.. వివరాలు 2లో

## ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి

భారత్‌లో రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి
మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రకటన
ప్రధాని మోడీతో భేటీలో పలు అంశాలపై చర్చ
స్వాగతించిన ప్రధాని నరేంద్రమోడీ



మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల మంగళవారం ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడిన ఇండియాలో పెడుతున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించారు. ఇది భారతదేశ ఆశయాలకు మద్దతు ఇస్తుందని చెప్పారు. భారతదేశ ఎఐ ఫస్ట్ ఫ్యూచర్' నిర్మించేందుకు, డెవలప్ చేసేందుకు శ్రీ17.5 బిలియన్లు అంటే రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడానికి కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. 4

## ఇండిగోకు కేంద్రం గట్టి షాక్

ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత
పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు
ప్రయాణికుల ఇబ్బందికి చింతిస్తున్నా: సీఈవో



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగోకు కేంద్రం గట్టి షాక్ ఇచ్చింది. ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత విధిస్తున్నట్టు కేంద్ర పౌరవిమా నయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. తద్వారా విమాన మిగతా 4 లో



# రెవెన్యూ సేవలను మరింత సులభతరం

2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి
రెవెన్యూ అధికారులతో సీఎం చంద్రబాబు
పాస్‌పోర్ట్ తరహా కార్యాలయాలను ఏర్పాటు చేస్తామన్న మంత్రి అనగాని

**అమరావతి :** రెవెన్యూ సేవలను మరింత సులభతరం చేయాలని ఆ శాఖ ఉన్నతాధి కారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాలు ఆటో మ్యుటేషన్ జరగాలని ఆయన పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలని ఆయన ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తోపాటు ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూ యజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని ఈ సందర్భంగా వారికి సూచించారు. రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని వారికి తెలిపారు. ప్రతి నెలా రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహిస్తానని వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో మిగతా 2 లో

## సంస్కృత విశ్వవిద్యాలయంలో దారుణం

లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు ప్రొఫెసర్ల అరెస్ట్



.. వివరాలు 2లో

## తిరుమల పరకామణి చోరీ కేసు

హైకోర్టుకు మరో నివేదికను సమర్పించిన సీఐడీ



.. వివరాలు 2లో



తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికపై నుంచి జిల్లాల కలెక్టరేట్లలోని తెలంగాణ తల్లి విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా ఆవిష్కరించారు. 4 కోట్ల ప్రజల అకాంక్షలను గుర్తించి యూపీఏ ప్రభుత్వం డిసెంబరు 9న తెలంగాణ ఏర్పాటును ప్రకటించిందని గుర్తు చేశారు.

## తెలంగాణ ఇచ్చిన రోజు 03

- సోనియా జన్మదినం సందర్భంగా ఏటా ఉత్సవాలు
- వర్చువల్‌గా జిల్లా కేంద్రాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఆవిష్కరణ



# స్కూళ్లకు 6 రోజుల సెలవు

**ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం నిర్ణయం**

**హైదరాబాద్, డిసెంబర్ 9:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల కారణంగా పాఠశాలలకు వరుస సెలవులు లభించనున్నాయి. ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తుండటంతో, ప్రభుత్వం పలు దఫాలుగా సెలవులు ప్రకటించింది. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలోని విద్యార్థులు, ఉపాధ్యాయులకు సుమారు ఆరు రోజుల పాటు విరామం దొరకనుంది. తొలి విడత పోలింగ్ నిర్వహణ, ఏర్పాట్ల కోసం జనవరి 10, 11 తేదీల్లో పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఇక రెండో విడత ఎన్నికల పోలింగ్ జనవరి 13, 14 తేదీల్లో జరగనుండగా, ఆ రోజులు రెండో శనివారం, ఆదివారం కావడంతో అవి సాధారణ సెలవులుగా కలిసివచ్చాయి. అనంతరం మూడో విడత పోలింగ్ సందరరేగా జనవరి 16, 17 తేదీల్లో కూడా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులతో పాటు కార్మికులకు సైతం వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు**



**హైదరాబాద్,డిసెంబర్ 9:** తెలంగాణలో పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. 2026 మార్చి నెల 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలంగాణ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. పరీక్షల నిర్వహణకు సంబంధించి పూర్తి టైమ్‌టేబుల్‌ను విడుదల చేస్తూ, విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్, 18న సెకెండ్ లాంగ్వేజ్, 23న ఇంగ్లీష్, 28న గణితం, ఏప్రిల్ 2న ఫిజిక్స్, ఏప్రిల్ 7న బయాలజీ, ఏప్రిల్ 13న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 15న ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పీరీక్ష, ఏప్రిల్ 16న ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష జరగనుంది. ఈ షెడ్యూల్ ప్రకారం ప్రతి పరీక్షకు మధ్య మూడు రోజుల గ్యాప్‌ను కల్పించారు. దీని ద్వారా విద్యార్థులు ఒక పరీక్ష నుంచి మరో పరీక్షకు సమగ్రంగా సిద్ధమయ్యే అవకాశం ఉంటుందని బోర్డు పేర్కొంది. గతంలో ఒకటి లేదా రెండు రోజుల గ్యాప్‌తో పరీక్షలు నిర్వహించడం వల్ల విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఆ పరిస్థితిని దృష్టిలో ఉంచుకునే ఈసారి గ్యాప్‌ను పెంచామని అధికారులు వెల్లడించారు. మార్చి 14న మొదటి భాష పరీక్షతో ఎస్ఎస్‌సీ పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆ తర్వాత రెండో భాష, మూడో భాష (ఆంగ్లం), గణితం, సైన్స్ (ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్), సామాజిక శాస్త్రం పరీక్షలు వరుసగా నిర్వహిస్తారు. ఏప్రిల్ 13న చివరిగా సోషల్ స్టడీస్ పరీక్షతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఎక్కువ భాగం పరీక్షలు జరుగుతాయని బోర్డు స్పష్టం చేసింది. సైన్స్ అంశాలకు సంబంధించిన పరీక్షలకు నిర్ణీత సమయం కొద్దిగా భిన్నంగా ఉంటుందని అధికారులు తెలియజేశారు. వృత్తి విద్య (వొకేషనల్) విద్యార్థులు, ఓపెన్ స్కూల్ విద్యార్థులకు కూడా ఇదే షెడ్యూల్ వర్తిస్తుందని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రశ్న పత్రాల గోప్యతకు ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే హాల్‌టికెట్ల పంపిణీ, పరీక్ష కేంద్రాల కేటాయింపును ముందుగానే పూర్తి చేస్తామని తెలిపారు. విద్యార్థులు పరీక్షల టైమ్‌టేబుల్‌ను గమనించి, ప్రణాళికబద్ధంగా చదువు కొనసాగించాలని అధికారులు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడమే లక్ష్యంగా ఈ షెడ్యూల్‌ను రూపొందించినట్లు బోర్డు స్పష్టం చేసింది.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు

**అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు**



**హైదరాబాద్, డిసెంబర్ 9:** మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపులు వచ్చాయి. విమానంలో బాంబు ఉందంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. బాంబు పేలకూడదంటే మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మెయిల్‌తో అప్రమత్తమైన శంషాబాద్ ఎయిర్‌పోర్టు అధికారులు.. ఐసోలేషన్ బే దగ్గర ఫ్లైట్‌ని ఉంచి పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఆ అనుమానాస్పద మెయిల్ న్యూయార్క్ నుంచి వచ్చినట్టు నిర్ధారించారు. ఎలాంటి ముప్పు లేదని సెక్యూరిటీ టీమ్ క్లారిటీ ఇచ్చింది. ఈ ఏడాదిలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి 20కిపైగా బెదిరింపు కాల్స్, మెయిల్స్ వచ్చాయి. 5 ఘటనల్లో నిందితుల గుర్తించారు. మిగతా కేసుల్లో విచారణ కొనసాగుతోంది.

# గ్లోబల్ సమ్మిట్ విజయవంతం

మొదటి పేజీ తరువాయి

ఆ డాక్యుమెంట్‌ను చూస్తే నిపుణుల అభిప్రాయాలు మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రజల ఆశయాలు కూడా ప్రతిబింబించినట్లు అనిపించిందన్నారు. యువత, మహిళలు, సమగ్ర అభివృద్ధి వంటి అంశాలు సమతుల్యంగా ఇందులో పొందుపరిచినట్లు ప్రశంసించారు. ఇంత స్ఫూర్తి దాయకమైన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆనంద్ మహీంద్రా ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం స్పష్టమైన దిశ, ధైర్యమైన లక్ష్యాలతో ముందుకు వెళ్తున్న నాయకత్వం తెలంగాణలో కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో మహిళలు నిర్వహిస్తున్న బ్యాటరీ తయారీ పరిశ్రమ తమకు గర్వకారణమని ఆనంద్ మహీంద్రా చెప్పారు. మహిళా సాధికారత, పారిశ్రామిక అభివృద్ధి రెండూ కలిసొచ్చేలా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. 4దశాబ్దాలుగా వ్యాపార రంగంలో ఉన్న తన అనుభవంతో చూస్తే, రేవంత్ రెడ్డి తనకు ఒక సమఉజ్జీలా కనిపిస్తున్నారని ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యానించారు. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో ఈ తరహా నాయకత్వం కీలకంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో అన్ని సెషన్లు ముగిశాయి. ఈ సందర్భంగా 'తెలంగాణ రైజింగ్ విజన్-2047' డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా, అగ్రనటుడు చిరంజీవి, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ మహీంద్రా మాట్లాడుతూ.. దీర్ఘకాలిక లక్ష్యాలతో డాక్యుమెంట్‌ను



రూపొందించారని కితాబిచ్చారు. 'స్కిల్ యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉండాలని మొదట సీఎం నన్ను అడిగారు. అప్పటికే టెక్ మహీంద్రా యూనివర్సిటీకి ఛైర్మన్‌గా ఉన్నందున వద్దని చెప్పాను. అయితే, ఆయన లక్ష్యాలు, విజన్ విన్నాక తిరస్కరించలేకపోయాను. తెలంగాణ రైజింగ్ విజన్ బ్లూప్రింట్ చూశాను. ప్రజలు కేంద్రంగా దీన్ని రూపొందించారని అన్నారు. తెలంగాణ గొప్ప అభివృద్ధి సాధిస్తోందని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. 'హైదరాబాద్ ఐకానిక్ నగరంగా నిలిచింది. ప్రపంచస్థాయి కంపెనీలకు ఇప్పుడు గమ్యస్థానంగా ఉంది. నీతి ఆయోగ్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఉంది. దేశంలోనే వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. ఏటా 8-9 శాతం వృద్ధి సాధిస్తే.. తెలంగాణ తన లక్ష్యాలను అందుకోగలదు ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీకి హబ్‌గా హైదరాబాద్ నిలిచింది. భౌతిక మౌలిక వసతులతోపాటు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ పెరగాలి. చైనా గ్వాంగ్‌డాంగ్ నమూనాను తెలంగాణ ప్రభుత్వం ఎంచుకుంది. తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్ మాత్రమే కాదు.. అన్ బీటబుల్ అని సుబ్బారావు పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌కు విభిన్న ఆలోచనలతో వచ్చిన అందరికీ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. అందరి సూచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు. 'తెలంగాణ భవిష్యత్తుకు ఈ డాక్యుమెంట్ ఒక దిక్సూచి. డాక్యుమెంట్ రూపకల్పనలో అన్ని రంగాల మేధావుల సలహాలు తీసుకున్నాం. రాష్ట్రంలో డిజిటల్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌కు కూడా ప్రాధాన్యం ఇస్తాం' అని చెప్పారు.

# రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం

- రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు
- సిఎం రేవంత్ సమక్షంలో పలు కంపెనీల ఒప్పందాలు

**హైదరాబాద్, డిసెంబర్ 9:** తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైజింగ్ గ్లోబల్ సమిట్ రెండో రోజు భారీ పెట్టుబడులు సమకూరాయి. వివిధ కంపెనీలు తమ పెట్టుబడులను ప్రకటించాయి. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో పలు ఒప్పందాలు సాగాయి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు దేశ, విదేశాలకు చెందిన వివిధ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయి. వివిధ కంపెనీల ప్రతినిధులతో వరుస సమావేశాలతో సీఎం రేవంత్‌రెడ్డి బిజీ బిజీగా ఉన్నారు. ఆయన సమక్షంలో పలు కంపెనీలు ఎంవోయూలు కుదుర్చుకుంటున్నాయి. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డితో గోద్రెజ్ జెర్సీ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ ఫిరోజ్ షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణపై ఫిరోజ్‌షా గోద్రెజ్ సీఎంతో చర్చించారు. పాలు, ఎఫ్ఎంసీజీ, రియల్ఎస్టేట్, ఆయిల్‌పామ్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ఆసక్తి కనబరిచింది. మరోవైపు సుమధుర గ్రూప్, టీసీసీఐ తైవాన్ గ్రూప్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. రాష్ట్రం రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకొచ్చింది. కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌డీఎంవో) నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వచ్చే నాలుగేళ్లలో 200 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనుంది. ఈ మేరకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశల్లో ఫెర్టిస్ ఇండియా రూ.2 వేల కోట్ల పెట్టుబడి



పెట్టనుంది. మరోవైపు ఫుడ్ అండ్ బేవరేజెస్ యూనిట్-2 విస్తరణకు కేజేఎస్ ఇండియా ఒప్పందం కుదర్చుకుంది. ఫ్రీజ్- డ్రైడ్ కాఫీ ఎ÷-లాంట్ నిర్మాణానికి వింటేజ్ కాఫీ అండ్ బేవరేజెస్ ఒప్పందం కుదుర్చుంది. ఫుడ్ అండ్ ఎఫ్ఎంసీజీ తయారీ యూనిట్‌కు ఆర్‌సీపీఎల్, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మ్యానుఫాక్చరింగ్ సేవల విస్తరణకు క్లైన్స్ టెక్నాలజీ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. రూ.9 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు జేసీకే ఇన్‌ఫ్రా, మూడు దశల్లో రూ.2,500 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆర్‌సీటీ ఎనర్జీ ఇండియా, 50 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ డేటా సెంటర్‌కు అక్వెలోన్ నెక్సస్, హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటుకు ఏజీపీ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకున్నాయి. రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు ఏఐ-రెడీ డేటా పార్క్ ప్రకటించింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్న అరబిందో ఫార్మా, పెప్టైడ్స్ తయారీ అండ్ ఆంకాలజీ సీడీఎంవో యూనిట్ పెట్టనున్న గ్రాన్యుల్స్ ఇండియా పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి. ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు.. రాష్ట్రానికి పెట్టుబడుల వరద పారింది.. బ్యాక్‌టు బ్యాక్ మీటింగ్‌లు, వరుసగా మౌ సంతకాలతో రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి పలు కంపెనీలతో చర్చలు జరిపారు. రెండో రోజు మొత్తం రూ.1,11,395 కోట్ల పెట్టుబడులు తెలంగాణకు రావడం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఊతం కానుంది. ఈ పెట్టుబడులతో కొత్త సంస్థలు.. భారీ స్థాయిలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా రాబోతున్నాయి.. అయితే, పెట్టుబడుల సంఖ్య మరింత పెరగనుంది..

# సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

**ఓటమి భయంతో ఘాతుకం ● సంగారెడ్డి జిల్లాలో ఘటన**



**హైదరాబాద్,డిసెంబర్9:** తెలంగాణలో జరుగుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఒత్తిడితో కూడిన వాతావరణంలో సాగుతోంది. ఈ క్రమంలో పలుచోట్ల విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ముగ్గురు అభ్యర్థులు మృతి చెందగా, సిద్దిపేట జిల్లాలో ఓ అభ్యర్థిపై కేసు నమోదైంది. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న సీహెచ్ రాజు (36) ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోతాననే ఆందోళనతో, నమ్మినవాళ్లే ప్రచారానికి రావడం లేదన్న మనోవేదనతో ఆయన చెట్టుకు ఉరేసుకుని మరణించారు. ఆదివారం రాత్రి తోటి అయ్యప్ప స్వాములతో తన ఆవేదన పంచుకోగా, వారు ధైర్యం చెప్పినప్పటికీ సోమవారం ఉదయం ఆయన విగతజీవిగా కనిపించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మంచర్లగూడలో 8వ వార్డుకు పోటీ చేస్తున్న పల్లె లత (42) ప్రచారం నిర్వహిస్తుండగా గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే కన్నుమూశారు. అలాగే, సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో 8వ వార్డు అభ్యర్థి కొత్తొల్ల పద్మారావు (50) ఆదివారం రాత్రి ప్రచారం ముగించుకుని ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి నిద్రలోనే గుండెపోటుతో మ ృతి చెందారు. ఆయన మరణంతో ఆ వార్డులో పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య రెండుకు చేరిందని, ఎన్నికలకు ఎలాంటి ఆటంకం లేదని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వంగపల్లిలో సర్పంచ్ అభ్యర్థి చల్ల కమలాకర్ రెడ్డి బాండ్ పేపర్‌పై హామీలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారని పేర్కొంటూ, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# చలి పంజా

**గణనీయంగా పెరిగిన చలి తీవ్రత**

**హైదరాబాద్,డిసెంబర్ 9 :** తెలంగాణలో చలి తీవ్రత గణనీయంగా పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-4 డిగ్రీలు తగ్గాయి. రానున్న నాలుగు రోజులు చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్పంగా 7.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దాదాపు అన్ని జిల్లాల్లో కనిష‘ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల మేర తగ్గాయి. ముఖ్యంగా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో రహదారులపై దృశ్యత తగ్గి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం చింతగూడకు చెందిన 60 ఏళ్ల వృద్ధుడు గంగారెడ్డి చలి తీవ్రతకు బలవ్వడం ఈ పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. రానున్న రోజుల్లో చలి ప్రభావం మరింత ఎక్కువ అవుతుందని చెప్పారు. ముఖ్యంగా వచ్చే నాలుగు రోజులు (డిసెంబర్ 10, 11, 12, 13) చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలోనే అత్యల్ప కనిష‘ ఉష్ణోగ్రత సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చలి ప్రభావం అధికంగా ఉన్నప్పటికీ, దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లోనూ చలిగాలుల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈనెల 16 వరకు చలిగాలుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని అంచనా వేశారు. ముఖ్యంగా జగిత్యాల, సంగారెడ్డి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, వికారాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి ఉన్నాయి.ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలోనూ చలి తీవ్రత పెరగనుందని, ఇక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు 9 డిగ్రీల సెల్సియస్ నుంచి 12 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. వృద్ధులు, పిల్లలు తప్పనిసరిగా వెచ్చటి దుస్తులు ధరించాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రాకుండా ఉండాలని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ప్రజలు చలి నుంచి రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెచ్చటి దుస్తులు ధరించాలని, వేడి వేడి భోజనం చేయాలని తెలిపారు.



# భారీగా ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- అందుకు అనుగుణంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- 13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి
- ఏఐ సిటీ, హెల్త్ సిటీ, స్పోర్ట్స్ హబ్ అభివృద్ధి
- గ్లోబల్ సమిట్‌లో ఐటి మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, డిసెంబర్ 9:** భారీగా ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. నెట్ జీరో కార్బన్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో నిర్వహించిన సెషన్‌లో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌కు నాలుగో న్యూక్లియస్ (కేంద్రం)గా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామన్నారు. 13,500 ఎకరాల్లో గ్రీన్ సిటీగా అభివృద్ధి చేస్తాం. ఫ్యూచర్ సిటీని మెట్రో రైలుతో అనుసంధానిస్తాం. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు అనుగుణంగా తీర్చిదిద్దుతాం అన్నారు. జోన్లవారీగా విభజించి ప్రతి జోన్‌ను విభిన్నంగా తీర్చిదిద్దుతాం. ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎంటర్‌టైన్‌మెంట్ డిస్ట్రిక్ట్, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ జోన్, ఎకో టూరిజం హబ్ ఉంటాయి. ఫ్యూచర్ సిటీలో వర్సిటీల ఏర్పాటుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. త్వరలోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభిస్తాం. జూపార్క్ ఏర్పాటుకు వంతారాతో ఇప్పటికే ఒప్పందం జరిగింది. 400 ఎకరాల్లో డేటా సెంటర్ సిటీ నిర్మాణం జరుగుతుందని శ్రీధర్‌బాబు వివరించారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే ప్రపంచ స్థాయి నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్టు శ్రీధర్ బాబు వెల్లడించారు. అద్భుతమైన మౌలిక వసతులతో ఏర్పాటయ్యే ఈ నగరాన్ని 13,500 ఎకరాలలలో జీరో కార్బన్ సిటీగా రూపొందించనున్నట్టు తెలిపారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ, యాజ్ ఏ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణా' అనే అంశంపై ప్రభుత్వ ప్రణాళికలను మంగవారం నాడు ఆయన గ్లోబల్ సమ్మిట్‌లో వివరించారు. భవిష్యత్ నగరాన్నిఆరు అర్బన్ జిల్లాలుగా అభివృద్ధి చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఇక్కడ ఏర్పాటయ్యే వివిధ పరిశోధన సంస్థలు, గ్రీన్ ఫార్మా, మ్యాన్యుఫాక్చరింగ్, ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ల ద్వారా మొత్తం 13 లక్షల మందికి ఉద్యోగాలు దొరుకుతాయి. 9 లక్షల జనాభా కోసం నివాస గృహాల సముదాయాలు ఏర్పాటు చేస్తాం. నిర్మాణరంగంలో ఉన్నవారు వీటిని అభివృద్ధి చేస్తారు. మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలు కేటాయిస్తున్నాం. వచ్చే ఫిబ్రవరి చివరలో ఇక్కడ నిర్మాణాలు మొదలవుతాయి. ఎంటర్ టెయిన్ మెంట్ జోన్ (డిస్ట్రిక్ట్ ) లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్ వెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేస్తాం. అడ్వెంచర్ కేంద్రాలు, స్టార్ హోటళ్లు నిర్మిస్తాం. ఫ్యూచర్ సిటీ అంతా ఒక ఆర్కిటెక్చరల్ అద్భుతంగా నిలుస్తుంది. భవిష్యత్తు అవసరాలకు సరిపోయే అత్యాధునిక రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. అర్బన్ ఫారెస్టులతో అంతా పచ్చదనం పర్చుకుని కనిపిస్తుంది. వన్య ప్రాణుల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి రిలయన్స్ ఫౌండేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ జీరో కార్బన్ సిటీ ప్రపంచంలోనే ప్రఖ్యాత నగరంగా భాసిల్లుతుంది. ఇక్కడ కురిసే ప్రతి వర్షం చుక్క ఇక్కడే ఇంకిపోయేలా రెయిన్ హార్వెస్టింగ్ జరుగుతుంది. భూగర్భ జలాలకు కొదవ లేకుండా చేస్తాం. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాల రంగాల్లో నూతన పరిశోధనలు, మ్యాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాలు ఉంటాయన్నారు.

# ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్ రద్దు కేసు

## విచారణ నేటికి వాయిదా వేసిన సుప్రీం కోర్టు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించి.. ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పిటిషన్‌పై నవంబర్ 18వ తేదీనే వాదనలు జరగాల్సి ఉంది. కానీ ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో.. ఈ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా పడింది.ఇక ఈ కేసులో కీలక ఆధారాలను ప్రభాకర్ రావు ధ్వంసం చేశారంటూ సుప్రీంకోర్టును ప్రభుత్వం ఆశ్రయించింది. డిజిటల్ ఎక్విప్‌మెంట్, పాస్ వర్డ్ ఇవ్వకుండా విసిగించడంతో పాటు విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించడం లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తమ వాదనలను వినిపించారు. దీంతో ఫోరెన్సిక్ నిపుణుల ముందు ఐ క్లౌడ్, పాస్ వర్డ్ రీసెట్ చేయాలని గత విచారణలో ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల నేతలపైనే కాకుండా.. స్వపక్షంలోని పలువురి కీలక నేతలపై ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే విషయాన్ని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అగ్రనేతలు సైతం ఆరోపించారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీకి ఓటరు పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఫోన్ ట్యాపింగ్ అంశంపై వాస్తవాలు వెలికి తీయాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు ఉన్నతాధికారులను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దాంతో ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవమని సిట్ అధికారుల ధృవీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులను అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. అమెరికాలో ఉన్నారు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ప్రభాకర్ రావు.. సిట్ అధికారులు అరెస్ట్ చేయకుండా ఉండాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభాకర్ రావును ముందస్తు అరెస్ట్ చేయవద్దంటూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణకు హాజరైన ప్రభాకర్ రావు.. సిట్ అధికారులు సంధించిన పలు ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు ఇవ్వలేదు. మరోవైపు ప్రభాకర్ రావుకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఆయన బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును రేవంత్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ కేసును బుధవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్తాడు

## మైనంపల్లి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, డిసెంబర్ 9:** మైనంపల్లి హన్మంతరావు సంచలన కామెంట్స్ చేశారు. మాజీమంత్రి కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లడం ఖాయం.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. కాళేశ్వరం, ఈ కార్, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మైనంపల్లి అన్నారు. మైనంపల్లి హన్మంతరావు సంచలన కామెంట్స్ చేశారు. మాజీమంత్రి కేటీఆర్ మళ్లీ అమెరికా వెళ్లడం ఖాయం.. అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. అలాగే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. కాళేశ్వరం, ఈ కార్, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మైనంపల్లి అన్నారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు విలక్షణమైన తీర్పునిచ్చారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో కోల్పోయిన ఇంకా అధికారంలోనే ఉన్నట్టు ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. పది సంవత్సరాల్లో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చని బీఆర్ఎస్ సోషల్‌మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం, ఈ కారు, ఇలా అన్నింటా స్కామ్ చేసి పార్టీ ఫండ్‌ను కూడబెట్టుకున్నారని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి ఆరోపించారు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న మీడియా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన విజ్ఞప్తి చేశారు. మెదక్ జిల్లాలో 240 గ్రామ పంచాయతీలు ఉంటే 15 మంది ఏకగ్రీవమయ్యారన్నారు. స్థానిక సంస్థల్లో 80శాతం స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు.

# సోనియాకు ఎంపి శుభాకాంక్షలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్, రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి సోనియా గాంధీని కలిసి ఆమెకు 79వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీమతి సోనియా గాంధీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు మరియు శుభాభినందనలను తెలియజేశారు. జాతీయ రాజకీయాల్లో సోనియా గాంధీ దీర్ఘకాలిక సేవలు, నాయకత్వం, ప్రజాసేవ పట్ల సోనియా గాంధీ నిబద్ధతకు గాఢమైన గౌరవాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక సందర్భంలో అనిల్ కుమార్ యాదవ్ సోనియా గాంధీ ఆశీర్వాదాలు కూడా పొందారు. దేశవ్యాప్తంగా ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే ఆమె మార్గనిర్దేశక పాత్రను ఆయన ప్రశంసించారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** రూపాయి బలహీనత ఎఫెక్ట్‌తో బంగారం, వెండి ధరలు భగభగ మండిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా బంగారం ధరలు లక్షా 30 వేల మార్క్ దాటి పరుగులు పెడుతున్నాయి.. ఇటీవల తగ్గినట్లే తగ్గిన పసిడి ధరలు.. మళ్లీ పెరుగుతూ రికార్డు స్థాయికి చేరుకుంటుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అంతర్జాతీయంగా బంగారం ధరలు పెరుగుతుండటంతో.. దేశీయంగా కూడా పెరుగుతున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. తాజాగా.. గోల్డ్ ధర తగ్గగా.. సిల్వర్ ధర పెరిగింది.. పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,30,090 ఉంది.. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,19,250 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 ఉంది. కిలో వెండి ధర రూ.1,99,000 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,240, 22 క్యారెట్ల ధర రూ.1,19,400 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,090, 22 క్యారెట్ల ధర రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,30,910.. 22 క్యారెట్ల ధర రూ.1,20,000 ఉంది. వెండి కిలో ధర రూ.1,99,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,30,090, 22 క్యారెట్లు రూ.1,19,250 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,90,000 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి..



# తెలంగాణ ఇచ్చిన రోజు

## సోనియా జన్మదినం సందర్భంగా ఏటా ఉత్సవాలు

## వర్చువల్‌గా జిల్లా కేంద్రాల్లో తెలంగాణ తల్లి విగ్రహాలు ఆవిష్కరణ

**హైదరాబాద్, డిసెంబర్ 9:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికపై నుంచి జిల్లాల కలెక్టరేట్లలోని తెలంగాణ తల్లి విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. గ్లోబల్ సమ్మిట్ వేదికగా జిల్లాల్లోని కలెక్టరేట్ల పరిధిలోని తెలంగాణ తల్లి విగ్రహాలను వర్చువల్ గా ఆవిష్కరించుకోవడం సంతోషకరం అన్నారు. 4 కోట్ల ప్రజల అకాంక్షలను గుర్తించి యూపీఏ ప్రభుత్వం డిసెంబరు 9న తెలంగాణ ఏర్పాటును ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 9 న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించింది. ఎన్ని అడ్డంకులు, ఆటంకాలు ఎదురైనా సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చారు. సోనియా గాంధీ జన్మదినం డిసెంబరు 9 నే అందుకే ప్రతి ఏడాది డిసెంబర్ 9ని తెలంగాణ తల్లి ఆవిర్భావ దినోత్సవం, సోనియా గాంధీ పుట్టినరోజు జరుపుకోవడం మన అందరికీ సంతోషదాయకం అన్నారు. డిసెంబర్ 9, 2009 న సోనియా గాంధీ నేతృత్వంలో తెలంగాణ ఏర్పాటు పక్రియ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిన రోజు ఇదని, ప్రకటన తెలంగాణ ప్రజలకు సంతోషాన్ని ఇచ్చింది.. ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందన్నారు. అందుకే ప్రజా ప్రభుత్వంలో ఈ రోజుని తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. అందులో భాగంగానే గత ఏడాది సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పరిపాలనలో ఒక స్ఫూర్తి తీసుకొచ్చాం. వాళ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేట్లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించుకున్నాం అని సిఎం అన్నారు.2004 లో కరీంనగర్ గడ్డపై నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ మాట ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదినం డిసెంబర్ 9 తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన సోనియా గాంధీ జన్మదిన ఉత్సవాలను జరుపుకుంటాం అని సిఎం ప్రకటించారు.

# రాజ్యాంగాన్ని గుప్పిట్లో పెట్టుకునే కుట్ర

## ఆర్ఎస్ఎస్ చేతుల్లోకి రాజ్యాంగ వ్యవస్థలు

## సర్‌పై చర్చలో రాహుల్ ఘాటు విమర్శలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** రాజ్యాంగ వ్యవస్థలను చేతుల్లోకి తీసుకోవడమే రాష్ట్రీయస్వయంసేవక్ సంఘ్ ఎజెండా అని, ఆ ఎజండానే ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై మంగళవారం నాడు లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ వాదులకు సమానత్వంపై నమ్మకం లేదని, అన్ని వ్యవస్థలపైనా ఆధిపత్యం చూపుతున్నారని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థను సైతం ఆర్ఎస్ఎస్ తన గుప్పిట్లో ఉంచుకుందని ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని విద్యావ్యవస్థను మార్చేశారని, దేశంలోని వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యతిరేకులను ప్రభుత్వం టా÷-గ్గ÷ట్ చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకే ఈసీని వాడుకుంటున్నారని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సంస్కరణలు అమలు కావడం లేదని రాహుల్ ఆరోపించారు. ఈసీ నియామకంలో మోదీ, అమిత్‌షాకు ఎందుకంత ఆసక్తి అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లకు మోదీ, అమిత్‌షా బహుమతులిస్తున్నారని, సీబీఐ, ఈడీలను ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకుందని ఆరోపణలు గుప్పించారు. కేంద్రం, ఎన్నికల సంఘం కుమ్మకయ్యాయని, తాను నిజాలు మాట్లాడుతుంటే బీజేపీ జీర్ణించుకోలేక పోతోందని అన్నారు. తాను ఏదీ తప్పుగా మాట్లాడలేదని, పూర్తి ఆధారాలతోనే మాట్లాడుతున్నానని చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రం గొప్పలు చెప్పుకుంటోందని రాహుల్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్, హరియాణాలో పలు చోట్ల 'ఓట్ చోరీ' జరిగిందన్నారు. ఎన్నికల సీసీ ఫుటేజ్‌ను ధ్వంసం చేశారని, ఫేక్ ఓట్లపై ఈసీ క్లారిటీ ఇవ్వలేదని చెప్పారు. తాను అడిగిన ప్రశ్నలకు ఇప్పటికీ ఈసీ సమాధానం ఇవ్వలేదని అన్నారు.

# రేణుకా చౌదరి శునకం వివాదంపై బీజేపీ సీరియస్

## రాజ్యసభ చైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేత

**న్యూఢిల్లీ, డిసెంబర్9 :** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిపై వచ్చిన హక్కుల ఉల్లంఘన నోటీసును రాజ్యసభ చైర్మన్ ప్రివిలేజ్ కమిటీకి పంపించారు. పార్లమెంట్ ప్రాంగణంలోకి శునకాన్ని తీసుకువచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ సభ్యులు ఇచ్చిన నోటీసుపై విచారణ జరపాలని కమిటీని ఆదేశించారు. ఇటీవల పార్లమెంట్ సమావేశాల ప్రారంభం రోజున రేణుకా చౌదరి తన వాహనంలో ఓ శునకాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఆమె చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆమె ప్రవర్తన సభా హక్కులను ఉల్లంఘించడమేనని ఆరోపిస్తూ బీజేపీ సభ్యులు బ్రిజ్ లాల్, ఇందు బాలగోస్వామి రాజ్యసభ చైర్మన్‌కు ప్రివిలేజ్ నోటీసులు అందజేశారు. ఈ నోటీసును పరిశీలించిన చైర్మన్, తదుపరి విచారణ నిమిత్తం హక్కుల కమిటీకి (ప్రివిలేజ్ కమిటీ) పంపారు. ఈ కమిటీ రేణుకా చౌదరి వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, తన సిఫారసులతో కూడిన నివేదికను చైర్మన్‌కు సమర్పించనుంది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈ వివాదంలో తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది.




సంపాదకీయం

# గుదిబండగా మారిన వీసాల జారీ

ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో వీసాల జారీ గుదిబండగా మారింది. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటుంటే వారి కలలకు అమెరికా అడ్డుకట్ట వేస్తోంది. అర్థంలేని ఆంక్షలతో భారతీయ విద్యార్థులపై కొరడా ఝులిపిస్తుంది. ప్రపంచ దేశాలకు పెద్దన్న అయిన అమెరికాకు వెళ్లేందుకు చాలా మంది ఏటా ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. చదువు, ఉద్యోగం, వ్యాపారం, స్థిర నివాసం కోసం అమెరికా వెళ్తూ ఉంటారు. కానీ ఇప్పుడు అమెరికా అంటేనే స్టూడెంట్స్, పేరెంట్స్ తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ట్రంప్ ఎప్పుడు ఏం బాంబ్ పేలుస్తారో.. ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో.. దాని వల్ల తమకేం ఇబ్బందులు వస్తాయో అని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాదిలో అమెరికా ఇచ్చే స్టూడెంట్ వీసాలకు అప్లై చేసుకునే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పడిపోయింది. ఎంతలా అంటే కొవిడ్ సమయంలో కూడా ఇంతకు పడిపోవడం జరగలేదని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అమెరికాలో చదవాలని ఎంతో మంది కలలు కంటారు. అందుకోసం చాలా కష్టపడి చదివి.. అర్హత పరీక్షలు రాస్తారు. ఈసారి కాకపోతే వచ్చేసారి అంటూ ఏళ్ల తరబడి అమెరికా యూనివర్సిటీల్లో అడ్మిషన్ కోసం ఎదురు చూస్తూనే ఉంటారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను అమెరికాలో చదివించాలనే బలమైన పట్టుదలతో ఉంటారు. కానీ.. ప్రస్తుతం ఆ కలలు మొత్తం కల్లలు అవుతున్నాయి. రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తీసుకునే నిర్ణయాలు, విధిస్తున్న ఆంక్షలు, ప్రస్తుతం అక్కడి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని.. అమెరికాలో చదవాలని భావించే భారత విద్యార్థులు.. వెనకడుగు వేస్తున్నారు. గతంలో కరోనా మహమ్మారి విస్తరించిన సమయంలో కంటే తక్కువగా.. ఈసారి స్టూడెంట్ వీసాలకు దరఖాస్తులు వచ్చినట్లు అమెరికా దౌత్య అధికారులు చెబుతున్నారు. అంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించాలనే ఇండియన్ స్టూడెంట్స్ కలలు ఈ ఏడాది ఆరంభంలోనే సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా అమెరికా స్టూడెంట్ వీసాల సీజన్‌కు.. ప్రతీ ఏడాది మార్చి నుంచి జూలై నెలలు చాలా కీలకంగా ఉంటుంది. ఆగస్టు/సెప్టెంబర్‌లో ప్రారంభమయ్యే ఫాల్ సెమిస్టర్‌కు సిద్ధమయ్యే విద్యార్థులు.. మార్చి నుంచి జూలై మధ్య వీసాల కోసం భారీగా దరఖాస్తు చేసుకుంటారు. అయితే తాజా గణాంకాలు భారతీయ విద్యార్థులకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికా విదేశాంగ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి నుంచి మే మధ్య కాలంలో జారీ అయిన ఎఫ్-1 (అకాడమిక్) (ఎఫ్-1) వీసాల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 27 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది కేవలం 9,906 ఎఫ్-1 వీసాలు మాత్రమే భారతీయ విద్యార్థులకు జారీ అయ్యాయి. అంతకుముందు 2023లో ఇదే కాలంలో 14,987 వీసాలు జారీ కాగా.. 2024లో 13,478 వీసాలు భారతీయ విద్యార్థులు పొందారు. మరీ ముఖ్యంగా.. కొవిడ్-19 మహమ్మారి తర్వాత అంతర్జాతీయ ప్రయాణాలు తిరిగి ప్రారంభమైన 2022 మార్చి నెల నుంచి మే నాటి 10,894 వీసాలతో పోలిస్తే.. ఈ ఏడాది మరింత తగ్గడం గమనార్హం. అమెరికా స్టూడెంట్ వీసాలు తగ్గడంలో కొన్ని కీలక కారణాలు ఉన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం ఇందుకు ప్రధాన కారణం అని తెలుస్తోంది. మరోవైపు.. ఇజ్రాయెల్ గాజా యుద్ధంలో భాగంగా పాలస్తీనా మద్దతు ఆందోళనల్లో పాల్గొన్న పలువురు విద్యార్థుల (కొందరు భారతీయ విద్యార్థులు) వీసాలను రద్దు చేయడం.. అలాగే మే 27వ తేదీ నుంచి జూన్ 18వ తేదీ వరకు కొత్త వీసా దరఖాస్తులను 2 వారాల పాటు నిలిపివేసి.. దరఖాస్తుదారుల సోషల్ మీడియా కార్యకలాపాలపై నిఘా (సోషల్ మీడియా వెట్టింగ్) పెట్టడం వంటి ఆంక్షలతో విదేశీ విద్యార్థులు.. అమెరికాలో చదువుకోవాలంటేనే ఆలోచించే పరిస్థితి నెలకొంది. ఈ వీసా అప్లికేషన్లు 2 వారాలు ఆపడం వల్ల కూడా వీసా దరఖాస్తులు తగ్గడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికన్ యూనివర్సిటీలకు ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల్లో కోతలు విధించడం, అంతర్జాతీయ విద్యార్థుల నమోదుపై పెరుగుతున్న నిఘా వంటి సవాళ్లు కొత్తగా వచ్చి పడ్డాయి. పొలిటికో నివేదిక ప్రకారం.. మే నెలలో ట్రంప్ ప్రభుత్వం అమెరికా రాయబార కార్యాలయాలను, కాన్సులర్ విభాగాలను విద్యార్థి వీసా దరఖాస్తుదారులకు కొత్త ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను నిలిపివేయాలని ఆదేశించి.. వారి సోషల్ మీడియా వెట్టింగ్‌ను తప్పనిసరి చేయాలని ఆదేశించింది. జూన్ నాటికి.. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం ఎఫ్, ఎమ్, జే కేటగిరీ వీసా దరఖాస్తుదారులకు స్క్రీనింగ్ ప్రక్రియను సులభతరం చేయడానికి వారి సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్‌గా ఉంచాలని సూచించింది. ఈ ఏడాది మొదట్లో వీసా దరఖాస్తులు నెమ్మదించినప్పటికీ.. గత కొన్నేళ్లుగా అమెరికాలో చదువుకునేందుకు వెళ్లే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడం గమనార్హం. ఓపెన్ డోర్స్ 2024 డేటా ప్రకారం.. 2023-24 అకడమిక్ ఇయర్‌లో చైనా విద్యార్థులను అధిగమించి.. అమెరికాలోనే అతిపెద్ద అంతర్జాతీయ విద్యార్థులుగా భారతీయ విద్యార్థులు నిలిచారు. అంతకుముందు అమెరికాలో చదువుకునే విదేశీ విద్యార్థుల్లో చైనీయులు అగ్రస్థానంలో ఉండగా.. వారిని భారతీయులు అధిగమించారు. ఇది అమెరికా విద్య పట్ల భారతీయ విద్యార్థులకు ఉన్న ఆసక్తిని, పోటీని తెలియజేసింది. అయితే.. 2024లో మొత్తం విద్యార్థి వీసా జారీల్లో తగ్గుదల కనిపించింది. ఆ తర్వాత ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరితో ఆ సంఖ్య మరింత తగ్గింది. కొవిడ్ మహమ్మారి తర్వాత.. 2024లో భారతీయ పౌరులకు అమెరికా విద్యార్థి వీసాలు భారీగా తగ్గించినట్లు తెలుస్తోంది. జనవరి నుంచి సెప్టెంబర్ 2024 వరకు.. భారతీయ విద్యార్థులకు కేవలం ఎఫ్-1 వీసాలు 64,008 మాత్రమే జారీ అయ్యాయని తెలుస్తోంది. ఇదే 2023లో 1.03 లక్షలు.. 2022లో 93,181 నుంచి గణనీయమైన తగ్గుదల కనిపించింది.

# ఇండిగోకు కేంద్రం గట్టి షాక్

- ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత
- పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు
- ప్రయాణికుల ఇబ్బందికి చింతిస్తున్నా: సీఈఓ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఇండిగోకు కేంద్రం గట్టి షాక్ ఇచ్చింది. ఇండిగో షెడ్యూళ్లలో 10 శాతం కోత విధిస్తున్నట్టు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు ప్రకటించారు. తద్వారా విమాన సేవలను స్థిరీకరించడం సాధ్యమవు తుందన్నారు. ఇండిగో సేవలపై వివరణ కోరేందుకు సీఈఓ పీటర్ ఎల్బర్స్‌కు మంగళవారం పౌరవిమానయాన శాఖ సమన్లు జారీ చేసింది. ఈ భేటీ అనంతరం మంత్రి తన నిర్ణయం ప్రకటించారు. ఇండిగో అంతర్గత నిర్వహణలో వైఫల్యం, విమాన షెడ్యూళ్లు, కమ్యూనికేషన్ సరిగా లేకపోవడం వల్ల చాలా మంది ప్రయాణికులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొన్నారని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఈలోగా సంస్థ కార్యకలాపాలను సమీక్షించేందుకు మరోసారి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించినట్లు నాయుడు తెలిపారు. డిసెంబర్ 6 వరకు ప్రభావితమైన విమానాలకు టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులకు నూరు శాతం రిఫండ్లు పూర్తి చేసినట్లు ఇండిగో సీఈఓ మంత్రికి వివరించగా.. మిగిలిన మొత్తాలను కూడా త్వరగా వాపస్ చేయాలని ఆదేశించారు. ఇండిగో సేవల్లో ఈ పరిస్థితి తలెత్తకుండా అన్ని మార్గాల్లో విమాన సర్వీసులను తగ్గించాలని నిర్ణయానికొచ్చినట్లు మంత్రి తెలిపారు. మునుపటిలానే అన్ని గమ్యస్థానాలను కవర్ చేయాలని విమానయాన సంస్థను ఆదేశించారు. ఛార్జీలపై పరిమితి, ప్రయాణికుల సౌకర్యానికి సంబంధించి మంత్రిత్వశాఖ ఇచ్చిన అన్ని ఆదేశాలను పాటించాలని ఆదేశించారు. ఇదిలావుంటే ఇండిగో సంస్థ తాజా పరిస్థితుల నుంచి బయటపడి సాధారణ స్థితికి చేరుకుందని ఆ సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ తెలిపారు. ఇండిగో సంస్థలో తలెత్తిన ఇబ్బందుల వల్ల.. అత్యవసర పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వేల మంది ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ఈ విషయమై క్షమాపణలు కోరారు సీఈఓ. ఇండిగో విమాన సర్వీసుల్లోఇకపై ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని పీటర్ హామీ ఇచ్చారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఇండిగో విమానయాన సిబ్బంది అంతా తీవ్రంగా శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు. ప్రయాణికులే తమ తొలి ప్రాధాన్యమని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గత కొన్ని రోజులుగా విమాన సర్వీసులు రద్దవడంతో.. ఇప్పటికే లక్షలాది మంది ప్రయాణికులకు రీఫండ్ చెల్లింపు పక్రియ పూర్తి చేశామని సీఈఓ పేర్కొన్నారు. అలాగే సదరు ప్రయాణికులకు చెందిన లగేజీ సైతం వారి నివాసాలకు చేరవేశామని తెలిపారు. మిగిలిన మరికొన్ని బ్యాగేజీలనూ త్వరలోనే ఆయా ఇళ్లకు చేరుస్తామని, దీనికోసం తగిన ఏర్పాట్లు చేశామని ప్రకటించారు. తీవ్ర ఇబ్బందుల నడుమ.. డిసెంబర్ 5న 700౹ ÷÷-లట్లైను మాత్రమే నడపగలిగామని సీఈఓ వెల్లడించారు. అయితే.. సోమ, మంగళవారాల్లో పరిస్థితులు కాస్త మెరుగవ్వడంతో మొత్తం 1800 విమానాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రస్తుతం.. 138 గమ్య స్థానాలకు ఇండిగో ప్రయాణాలు కొనసాగుతు న్నాయన్న ఆయన.. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం(అ।నిబిసజీ ఉనీలబి)తో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. కేంద్రంతో పూర్తి సహకారంతో ముందడగు వేస్తున్నట్టు తెలిపారు.

# భారత్‌లో రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి


- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకట
- ప్రధాని మోడీతో భేటీలో పలు అంశాలపై చర్చ
- స్వాగతించిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల మంగళవారం ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయ్యారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడిన ఇండియాలో పెడుతున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించారు. ఇది భారతదేశ ఆశయాలకు మద్దతు ఇస్తుందని చెప్పారు. భారతదేశ ఎఐ ఫస్ట్ ఫ్యూచర్' నిర్మించేందుకు, డెవలప్ చేసేందుకు శ్రీ17.5 బిలియన్లు అంటే రూ. 1.5 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టడానికి కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. భారతదేశం ఎఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు సత్యానాదెళ్ల ప్రధాని నరేంద్రమోడీకి థాంక్స్ చెప్పారు. ఆసియాలోనే మైక్రోసాఫ్ట్ అతిపెద్ద పెట్టుబడి లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన చెప్పారు. మోడీతో మీటింగ్ గురించి నాదెళ్ల ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'భారతదేశ ఏఐ అవకాశంపై స్ఫూర్తిదాయకమైన సంభాషణలకు ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు, దేశ ఆశయాలకు మద్దతు ఇవ్వడానికి, ఇండియా ఏఐ ఫస్ట్ ఫ్యూచర్‌కు అవసరమైన మౌలికసదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను నిర్మించడంలో సహాయపడటానికి 17.5 బిలియన్ల పెట్టుబడి నిబద్ధతకు కట్టుబడి ఉన్నామని అన్నారు. గూగుల్, అమెజాన్ కూడా భారత్‌లో డేటా సెంటర్లు, ఏఐ హబ్‌ల ఏర్పాటులో బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించాయి. అక్టోబర్‌లో గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఏపీలోని విశాఖపట్నంలో ఏఐ హబ్ కోసం 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికను వెల్లడించారు. ప్రముఖ టెక్నాలజీ సంస్థ మైక్రోసాఫ్ట్ భారత్‌లో భారీ పెట్టుబడి పెట్టనుంది. భారత్ తన ఏఐ లక్ష్యాలను చేరుకోవడానికి 17.5 బిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టనున్నట్లు కంపెనీ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. ప్రధాని నరేంద్రమోదీతో మంగళవారం భేటీ అయిన ఆయన.. ఈ పెట్టుబడి గురించి ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. భారత్‌లో ఏఐ అవకాశాలపై స్ఫూర్తిదాయక సంభాషణ తమ మధ్య జరిగిందని పేర్కొంటూ ప్రధాని మోదీతో ఉన్న చిత్రాన్ని పోస్ట్ చేశారు. దేశ ఏఐ ఆశయాలకు మద్దతుగా పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టనున్నట్లు సత్యానాదెళ్ల ప్రకటించారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి అని పేర్కొన్నారు. భారత్‌లో కృత్రిమ మేధ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యాలు, సామర్థ్యాలను అందించేందుకు ఈ నిధులను వినియోగిస్తామన్నారు. రాబోయే నాలుగేళ్లలో (2026-29) మధ్య ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టనున్నట్లు మైక్రోసాఫ్ట్ తన ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన 3 బిలియన్ డాలర్లకు ఈ పెట్టుబడి అదనమని తెలిపింది. మైక్రోసాఫ్ట్ పెట్టుబడి ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఏఐ విషయంలో భారత్ పట్ల ప్రపంచం ఆశావాదంతో ఉందన్నారు. సత్యనాదెళ్లతో ఫలవంతమైన చర్చ జరిగిందని తెలిపారు. ఆసియాలోనే అతిపెద్ద పెట్టుబడి గమ్యస్థానంగా భారత్‌ను ఎంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. దేశ యువత ఈ గొప్ప అవకాశాన్ని అందిపుచ్చుకుంటుందని, ఏఐ అపారశక్తిని సృజనాత్మకంగా ఉపయోగించుకుంటుందని ఆకాంక్షించారు.

# వందేమాతర గీతం బెంగాల్‌కే పరిమితమా?

## ప్రియాంక వ్యాఖ్యలపై మండిపడ్డ అమిత్ షా



**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** పశ్చిమబెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందంటూ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తిప్పికొట్టారు. జాతీయ గేయం బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. జాతీయగేయాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యసభలో మంగళవారంనాడు జరిగిన చర్చలో అమిత్‌షా పాల్గొన్నారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకోవడంపై చర్చ ఎందుకని కొందరు సభ్యులు ప్రశ్నిస్తున్నారని, అయితే కాలంతో సంబంధం లేకుండా దేశప్రజల్లో వందేమాతరం ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉందని అమిత్‌షా అన్నారు. ఆ గేయానికి గతంలోనూ ఎంతో ఔన్నత్యం ఉందని, 2047లోనూ ఉంటుందని చెప్పారు. వందేమాతర గేయాన్ని ఎందుకు చర్చించాలని ప్రశ్నించే వారు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎన్నికలకు ముడిపెట్టి వందేమాతరం కీర్తిని తక్కువచేసి చూపాలని కొందరు అనుకుంటున్నారని విమర్శించారు. వందేమాతరం గేయాన్ని రచించిన బంకిం బాబు బెంగాల్‌లో పుట్టడం నిజమని, కానీ వందేమాతరం బెంగాల్‌కో, ఇండియాకో మాత్రమే పరిమితమైంది కాదని అన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం పోరాడిన భారతీయ వీరులు ప్రపంచంలో అజ్ఞాతంగా ఎక్కడ కలిసినా వందేమాతరం అని నినదించేవారని అన్నారు. నేటికీ మన సరిహద్దుల్లో దేశ అంతర్గత భద్రత కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న మన బలగాల నోట నిరంతరం వందేమాతరం మారుమోగుతోందని అన్నారు. తరతరాలకు వందేమాతరం స్ఫూర్తినిస్తోందని, వందేమాతర గేయంపై ఉభయసభల్లోనూ చర్చ జరపడం వల్ల భవిష్యత్ తరాలవారు కూడా మన జాతీయ గేయం ప్రాధాన్యత, కీర్తిని తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. బుజ్జగింపు రాజకీయాల కోసం వందేమాతర గేయాన్ని కాంగ్రెస్ విడగొట్టి ఉండకపోతే దేశ విభజన జరిగి ఉండేది కాదని అమిత్‌షా విమర్శించారు. వందేమాతరం 100 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు దేశంలో ఎమ్జగ్గ÷న్సీ విధించారని, దీంతో జాతీయ గేయం కీర్తిని చాటేందుకు అవకాశం లేకుండా పోయిందని అన్నారు. వందేమాతరం అంటూ నినదించిన వారిని ఇందిరాగాంధీ జైళ్లలో పెట్టించారని చెప్పారు. వందేమాతరంపై సోమవారంనాడు చర్చ జరిగినప్పుడు కూడా గాంధీ ఫ్యామిలీకి చెందిన ఇద్దరు గైర్హాజరయ్యారని గుర్తుచేశారు. జవహర్ లాల్ నెహ్రూ నుంచి ఇవాల్టి నాయకత్వం వరకూ వందేమాతర గేయాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారని విమర్శించారు.



# సౌదీ అరేబియా సంచలన నిర్ణయం

## మద్యం అమ్మకాలపై నిబంధనల సడలింపు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 9:** సౌదీ అరేబియా ప్రభుత్వం మద్యం అమ్మకాల విషయంలో మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో నివసిస్తున్న ముస్లిమేతర విదేశీయులకు మద్యం కొనుగోలు చేసేందుకు మరిన్ని సడలింపులు ఇచ్చింది. నెలకు 50,000 రియాళ్లు (సుమారు 13,300 డాలర్లు) లేదా అంతకంటే ఎక్కువ జీతం ఉన్నవారు ఇప్పుడు మద్యం కొనుగోలు చేయవచ్చు. ఈ నిబంధన ప్రకారం, అర్హులైన విదేశీయులు తమ జీతం వివరాలను ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను చూపించి, రాజధాని రియాద్‌లో ఉన్న ఏకైక మద్యం విక్రయ కేంద్రంలోకి ప్రవేశం పొందాల్సి ఉంటుంది. గత ఏడాది విదేశీ దౌత్యవేత్తల కోసం ప్రారంభమైన ఈ స్టోర్‌లోకి, ఇప్పుడు 'ప్రీమియం రెసిడెన్సీ' హోదా కలిగిన ముస్లిమేతరులకు కూడా ప్రవేశం కల్పించారు. నెలవారీ పాయింట్ల ఆధారిత కోటా పద్ధతిలో ఇక్కడ అమ్మకాలు జరుగుతాయి. విదేశీ నిపుణులను, పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సౌదీ ప్రభుత్వం ఈ సామాజిక సంస్కరణలను చేపడుతోంది. రియాద్‌ను అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగానే ఈ సడలింపులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. గత కొన్నేళ్లుగా సౌదీలో మహిళల డ్రైవింగ్‌పై నిషేధం ఎత్తివేయడం, సినిమా థియేటర్లు, వినోద కార్యక్రమాలకు అనుమతివ్వడం వంటి అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. రియాద్‌తో పాటు దేశంలోని మరో రెండు నగరాల్లో కూడా కొత్త మద్యం దుకాణాలను ఏర్పాటు చేయబోతున్నట్టు సమాచారం.

# రెవెన్యూ సేవలను మరింత సులభతరం

మొదటి పేజీ తరువాయి

జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వెబ్ ల్యాండ్‌లో ఏ మార్పు జరిగినా అది ఆన్‌లైన్‌లో శాశ్వతంగా నిక్షిప్తం అయ్యేలా వ్యవస్థను రూపొందిస్తు న్నామని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష అనంతరం మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. గత పాలకులు చేసిన పాపాల వల్లే రెవెన్యూ సమస్యలు కొనసాగు తున్నాయని మండిపడ్డారు. ఏడాదిన్నరగా వైసీపీ ప్రభుత్వ పాపాలు కడిగేందుకు కృషి చేస్తున్నందు వల్లే ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దోచుకునేందుకు గత పాలకులు అస్తవ్యస్తం చేసిన విధానాలు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నాయని పేర్కొన్నారు. 7,600 గ్రామాల్లో పకడ్బందీగా రీ సర్వే పూర్తి చేశామని వివరించారు. అవినీతి,అక్రమాలకు తావులేకుండా పాస్‌పోర్ట్ కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని సీఎం చంద్రబాబు సూచించారన్నారు. జాయింట్ కలెక్టర్లు లేని జిల్లాలకు వెంటనే వారిని నియమించాలని సీఎం ఆదేశించారని చెప్పారు. 26 జిల్లాల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసమే జేసీలు పని చేయాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. భూ సమస్యలన్నింటికీ ఇకపై జాయింట్ కలెక్టర్లదే బాధ్యత అని మంత్రి అనగాని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ' ఏర్పాటు దిశగా ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సచివాలయంలో రెవెన్యూశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించి.. కీలక సూచనలు చేసినట్లు తెలిపారు. స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఈ ఏడాది రూ.10,169 కోట్ల ఆదాయం ఆర్జించడమే లక్ష్యమని సీఎం చెప్పారని మంత్రి తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పాస్‌పోర్టు కార్యాలయాల తరహాలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తీసుకురావాలని సీఎం ఆదేశించారన్నారు. వెబ్ ల్యాండ్‌లో ఏ మార్పు జరిగినా.. అది ఆన్‌లైన్‌లో శాశ్వతంగా నిక్షిప్తమయ్యే వ్యవస్థ తీసుకొస్తున్నట్లు తెలిపారు. గత పాలకులు చేసిన తప్పుల వల్లే రెవెన్యూ సమస్యలు కొనసాగుతు న్నాయని విమర్శించారు. ' గత పాలకులు చేసిన అస్తవ్యస్తవిధానాలు ఇప్పుడిప్పుడే ఓ కొలిక్కి




వస్తున్నాయి. మొత్తం 7,600 గ్రామాల్లో పకడ్బందీగా రీ సర్వే పూర్తి చేశాం. జేసీలు లేని జిల్లాలకు వెంటనే జేసీలను నియమించాలని సీఎం ఆదేశించారు. 26 జిల్లాల్లోనూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసమే జేసీలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. భూ సమస్యలన్నింటికీ ఇక జేసీలదే బాధ్యత చెప్పారు' అని అనగాని వెల్లడించారు. 22ఏ, ఫ్రీ హోల్డ్ సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో ఉ న్నామని అనగాని పేర్కొన్నారు. భూ వివాద రహిత ఆంధ్రప్రదేశ్‌ని తీర్చిదిద్దేందుకు ప్రతి బుధవారం కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారంపై గురువారం మంత్రి వర్గ ఉ పసంఘం భేటీకానున్నట్లు తెలిపారు.

## నాలుగు నెలల్లో వృద్ధిరేటు పెంపు

### నేడు అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి :** రానున్న నాలుగు నెలల్లో వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన ప్రణాళికలపై సిఎం చంద్రబాబు దృష్టి సారించారు. ఈ మేరకు అధికారులతో చర్చించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులతో పాటు వివిధ విభాగాల హెచ్‌వోడీలతో బుధవారం వెలగపూడి సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో కీలక సమావేశం జరగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 వరకూ వారితో సీఎం చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. రానున్న నాలుగు నెలల్లో వృద్ధిరేటు పెంపునకు తీసుకోవాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన ప్రణాళికలపై ఈ సందర్భంగా చర్చించనున్నారు. జీఎస్డీపీ, కేపీఐ, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, డేటా డ్రివెన్ గవర్నెన్స్ అంశాలపై సీఎం చంద్రబాబు అధ్యక్షతన చర్చ జరగనుంది. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై సైతం ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇక మూడు, నాలుగు త్రైమాసికాల్లో సాధించాల్సిన లక్ష్యాలపై అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేయనున్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, ప్రభుత్వం అందించే పౌరసేవలతోపాటు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో సంతృప్త స్థాయిపై చర్చించనున్నారు. ఫైళ్ల క్లియరెన్సు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, అవేర్, డేటా లేక్, ఐటీ అప్లికేషన్లపై ఈ సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఇక ప్రజల నుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు వాటి పరిష్కారంపై హెచ్‌ఓడీలకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేయనున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు వాటి ఫలితాలపై కూడా ఈ సమావేశంలో చర్చిస్తారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న రుణాలు, వాటి రీస్ట్రక్చరింగ్ అంశంపై శాఖల వారీగా సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు.

## 11 నుంచి అటల్ సందేశ్ యాత్ర

### అభినందనలు తెలిపిన చంద్రబాబు

### ఎన్డీయే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో టెలీకాన్ఫరెన్స్

**అమరావతి :** వాజ్ పేయి స్ఫూర్తిని యువతలో నింపేలా 'అటల్ సందేశ్... మోదీ సుపరిపాలన' యాత్ర తలపెట్టిన బీజేపీ కార్యవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు. మంగళవారం ఎన్డీయే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు చేపట్టే 'అటల్ సందేశ్ - మోదీ సుపరిపాలన' యాత్రలో పాల్గొనాలని నేతలకు పిలుపునిచ్చారు. రాజకీయ భీష్మునిగా భావించే అటల్ జీ శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడం సంతోషమన్నారు. దేశంలో సుపరిపాలనకు వాజ్‌పేయి నాంది పలికారని... ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాదిని వేశాయని గుర్తుచేశారు. వాజ్ పేయి అజాత శత్రువని, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని అన్నారు. ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన వాజ్ పేయి.. కష్టంతో ఎదిగి దేశానికి నాయకత్వం వహించార న్నారు. 9 సార్లు లోక్‌సభకు, 2 సార్లు రాజ్యసభకు ఎన్నికయ్యా రంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోందని సీఎం వెల్లడించారు. 18 ఏళ్ల వయసులో క్విట్ ఇండియా ఉ ద్యమంలో పాల్గొన్నారని.. 1998లో పోఖ్రాన్?2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తిని చాటారని కొనియాడారు. కార్గిల్ యుద్ధంతో శత్రువుకు తిరుగులేని సమాధానం ఇచ్చారన్నారు. వాజ్ పేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశ దశ దిశ మార్చిందన్నారు. తనకు వ్యక్తిగతంగా కూడా ఆయనతో అనుబంధం ఉందని.. రాష్ట్రాభివృద్ధిలో ఆయన నాడు ఎంతో సహాయం చేశారని తెలిపారు. రాష్ట్రం కోసం ఏది అడిగినా కాదనేవారు కాదన్నారు. ప్రజలకు పనికొచ్చే పనులు ఏం చెప్పినా చేస్తారని.. పాలసీల రూపకల్పన గురించి చాలా త్వరగా నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. టెలీ కమ్యూనికేషన్ రంగం, విమానయాన రంగంలో సంస్కరణలకు నాంది పలికారన్నారు. సుపరిపాలన ఏ విధంగా ఉండాలో ఎన్టీఆర్, వాజ్ పేయిను చూస్తే అర్థమవుతుందని తెలిపారు. ఎన్టీఆర్ కూడా విశిష్టమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అని... పట్టుదల, అనునిత్యం మంచి చేయాలనే ఆలోచనతో ఉ ండేవారని ముఖ్యమంత్రి అన్నారు. నాడు అణు పరీక్షలు అయినా, నేడు సింధూర్ అయినా... నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా అవి ఎన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047కు నెంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. 2047 నాటికి ఇండియా, ఇండియన్స్ నెంబర్ వన్ స్థానానికి వెళ్తారని ధీమా వ్యక్తం చేశారు. వాజ్‌పేయి శతజయంతి కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొని విజయవంతం చేయాలని... 'అటల్ సందేశ్ - మోదీ సుపరిపాలన' కార్యక్రమాన్ని విజయంతం చేయాలని నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

# ఐటీ, మౌలిక సదుపాయాలకు మద్దతివ్వండి

మొదటి పేజీ తరువాయి

మద్దతు ఇవ్వాలని కోరారు. ఏపీలో స్మార్ట్ సిటీలు, డిజిటల్ గవర్నెన్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ల కోసం ఐటీ మౌలిక సదుపాయాల ఆధునీకరణకు మద్దతు ఇవ్వాలని వినతి చేశారు. ఏఐ ఓప్స్ శిక్షణ, ఇంటర్న్ షిప్‌లు, ఆర్ అండ్ డి సహకారం కోసం ఏపీ టెక్ అకడమియాతో భాగస్వామ్యం వహించాలని కోరారు. స్కేలబుల్ స్యాస్ మోడల్స్ ద్వారా ఐటీ కార్యకలాపాల నిర్వహణతో పాటు ఏపీలో ఎస్ఎంఈలు, స్టార్టప్‌లను ప్రారంభించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థకు 5000 సంస్థలు కస్టమర్లుగా ఉన్నాయని తెలిపారు. వీటిలో ఫైనాన్స్, హెల్త్‌కేర్, రిటైల్, టెక్నాలజీలో పాటు ఫార్చ్యూన్ సహా 500 కంపెనీలు ఉన్నాయని వెల్లడించారు. భారతదేశంలోని బెంగళూరు, హైదరాబాద్‌లో ప్రధాన కేంద్రాల ద్వారా ఏఐ ఓప్స్, క్లౌడ్ నేటివ్ మానిటరింగ్‌లో ఆవిష్కరణలను ముందుకు తెస్తున్నామని చెప్పుకొచ్చారు.

ఏపీ ప్రతిపా దనలను పరిశీలిస్తామని ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మ పేర్కొ న్నారు. అంతకు ముందు అంతర్జాతీయస్థాయి వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్ట్‌నర్ అరుణ్ కుమార్‌ను మంత్రి లోకేష్ కలిశారు. విశాఖనగరం ఐటీ, డేటా హబ్‌గా శరవేగంగా అభివ ృద్ధి చెందుతోందని.. ఆంధ్రప్రదేశ్‌లో సెలెస్టా క్యాపిటల్ డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు. సెమీ కండక్టర్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్




రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని అన్నారు. కంపెనీలకు ఏపీ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమై న సమగ్ర ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. పరిశ్రమలకు నిరీ?త సమయంలో నేరుగా ప్రోత్సా హకాలను అందించేందుకు దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఎకౌంట్ విధానాన్ని ప్రారంభించనునట్లు మంత్రి లోకేష్ వెల్లడించారు. తాము ప్రధానంగా యూఎస్, ఇండియా, ఇజ్రాయెల్, ఆగ్నేయాసియా దేశాలపై దృష్టిసారిస్తున్నామని సెలెస్టా వీసీ మేనేజింగ్ పార్ట్‌నర్ అరుణ్ కుమార్ తెలిపారు. సెమీకండక్టర్లు, ఏఐ, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి డీప్ టెక్ రంగాలు, సాస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లాంటి ఎంటర్ ప్రైజింగ్ సాఫ్ట్ వేర్, గ్లోబల్ మార్కెట్‌లను అనుసంధానించే స్టార్టప్‌లలో పెట్టుబడులకు తాము ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అరుణ్ కుమార్ వెల్లడించారు.

# శ్రీవారి దర్శనం ఇక మరింత సులభం

### ఏఐ ఆధారిత ఐసీసీసీ కేంద్రం ఏర్పాటు




**అమరావతి :** శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను (ఐసీసీసీ) అందుబాటులోకి తెచ్చింది. ఇటీవలే బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త వ్యవస్థ ద్వారా వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లలో భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. ఏ కంపార్ట్‌మెంట్‌లో భక్తులు ఎంతసేపటి నుంచి వేచి ఉన్నారనే వివరాలను ఏఐ టెక్నాలజీతో గుర్తిస్తారు. ఎక్కువసేపు నిరీక్షిస్తున్న వారికి ప్రాధాన్యతనిచ్చి, వారిని త్వరగా దర్శనానికి పంపేలా చర్యలు తీసుకుంటారని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌వో మురళీకృష వివరించారు. భక్తులు క్యూలైన్‌లోకి ప్రవేశించినప్పటి నుంచి దర్శనం పూర్తయ్యే వరకు పూర్తి సమాచారం డాష్‌బోర్డులో కనిపిస్తుంది. దర్శనమే కాకుండా, అన్నప్రసాదాల వితరణను కూడా ఈ కేంద్రం సమర్థవంతంగా నిర్వహిస్తుంది. ఎంతమంది భక్తులకు అన్నప్రసాదం అందించారు, ఇంకా ఎంతమందికి అవసరం అనే వివరాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తుంది. భద్రతను పెంచేందుకు 250 ఫేస్ రికగ్నిషన్ కెమెరాలను కొనుగోలు చేయనున్నారు. నేర చరిత్ర ఉన్నవారి డేటాను దీనికి అనుసంధానం చేసి, అనుమానితులను సులువుగా గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. అలాగే తిరుమలకు వచ్చే వాహనాల సమాచారాన్ని పర్యవేక్షిస్తూ, కాలుష్య నియంత్రణకు పాత వాహనాలను నిలిపివేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.16 కోట్లు ఖర్చు చేయగా, మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.30 కోట్లకు చేరుతుందని అంచనా. ఏడుగురు దాతలు ఈ కేంద్రం నిర్మాణానికి సహకారం అందించారు. ఏడాది పాటు దీని నిర్వహణ బాధ్యతలను కూడా వారే చూసుకోనున్నారు. మొత్తం మీద భక్తులకు ఈ ఆధునిక సాంకేతికతతో తిరుమలలో పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకుంది.

## తిరుమల పరకామణి చోరీ కేసు

### హైకోర్టుకు మరో నివేదికను సమర్పించిన సీఐడీ

**అమరావతి :** తిరుమల పరకామణి చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి మరో నివేదికను హైకోర్టుకు సీఐడీ సమర్పించింది. తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసు లోక్ అదాలత్ వద్ద రాజీ వ్యవహారంపై సీఐడీ అదనపు నివేదికను వేసింది. అదనపు నివేదికను మరో రెండు సెట్లను సీల్డ్ కవర్లో రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు సమర్పించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశించింది. లోక్ అదాలత్ అవార్డ్ చట్టబద్ధతను తేల్చేందుకు విచారణ జరుపుతున్న సీజే నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలన నిమిత్తం నివేదికలు వారి ముందు ఉంచాలని రిజిస్ట్రీక్రి న్యాయస్థానం స్పష్టీకరించింది. అదనపు నివేదికను పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేసేందుకు తదుపరి విచారణను బుధవారం నాటికి హైకోర్టు వాయిదా వేసింది.కాగా.. అంతకు ముందే పరకామణి చోరీ కేసు రాజీ వ్యవహారం, రవికుమార్ ఆస్తులపై నివేదికలను సీఐడీ అధికారులు సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేసిన విషయం తెలిసిందే. సీఐడీ నివేదికను తమకు అందజేసేలా ఆదేశాలు ఇవ్వాలన్న రవికుమార్ తరపు సీనియర్ న్యాయవాది అభ్యర్థనను కూడా న్యాయస్థానం తోసిపుచ్చింది. కాగా.. 2023 ఏప్రిల్ 29న పరకామణి విధుల్లో రవికుమార్ అమెరికన్ డాలర్లను అపహరిస్తూ దొరికిపోయాడు. అయితే తొలిసారి దొంగతనం చేశానంటూ రవికుమార్?తో క్షమాపణ చెప్పించి ప్రభుత్వ లెక్కల ప్రకారం అప్పట్లో 14 కోట్ల 43 లక్షల విలువైన రవికుమార్ ఆస్తులను టీటీడీకి గిఫ్ట్ డీడ్?గా ఇచ్చేలా చేశారు. 2023 జూన్ 19న ఆ మేరకు తీర్మానం చేయడం ఆ తర్వాత 3 నెలలకే కేసును రాజీ కుదర్చడం వెనుక ఉన్న మతలబుపై విచారణ జరిపిన సీఐడీ హైకోర్టుకు నివేదిక సమర్పించింది.

## సంస్కృత విశ్వవిద్యాలయంలో దారుణం

### లైంగిక వేధింపుల కేసులో ఇద్దరు ప్రొఫెసర్ల అరెస్ట్

**తిరుపతి :** తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒడిశాలోని బాధితురాలి ఇంటి వద్ద విచారణ చేపట్టిన తిరుపతి వెస్ట్ పోలీసులు,యువతి ఇచ్చిన వీడియో స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఈ విచారణలో పోలీసులు కీలక వివరాలను రాబట్టినట్టు సమాచారం. ప్రొఫెసర్ లక్ష్మణ్ కుమార్.. తనను పలుమార్లు లైంగికంగా వేధించారంటూ.. స్టేట్‌మెంట్‌లో కీలక విషయాలను బాధితురాలు వెల్లడించింది. ఆ వేధింపులు తాళలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు చెప్పారు. అయితే.. 'ప్రొఫెసర్ శేఖర్ రెడ్డి వద్ద మన ఇద్దరి వీడియోలు ఉన్నాయి. ఆ వీడియో ఎలా వెళ్లింది' అని ప్రశ్నిస్తూ వేధింపులకు పాల్పడ్డాడని తెలిపింది. కానీ, ప్రొ.శేఖర్ రెడ్డి తనతో ఎప్పుడూ మాట్లాడలేదని పోలీసుల విచారణలో పేర్కొంది బాధితురాలు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితుడైన ప్రొ.లక్ష్మణ్ కుమార్ సహా మరో ప్రొఫెసర్శేఖర్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు.

## నగరి వద్ద రోడ్డు ప్రమాదం

### రెండు కార్లు ఢీకొని ముగ్గురు మృతి

### ఇద్దరు తిరుచానూరు పోటు కార్మికులుగా గుర్తింపు

**తిరుపతి :** రాష్ట్రంలో వరుసగా రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల్లో తమ వారిని కోల్పోయి.. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న పరిస్థితి. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ కూడా అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వంటివి ప్రమదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి. తాజాగా తిరుపతిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం ఉదయం తిరుపతిలోని నగరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు పరస్పరం ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు తిరుచానూరు అమ్మవారి ఆలయ పోటు వర్కర్లుగా గుర్తించారు. కార్మికులు ఇద్దరు తిరుపతి నుంచి తిరుత్తనికి కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో నగరి మండలం తడుకు పేట వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో ఆ ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే మరో కారు డ్రైవర్ కూడా సంఘటనా స్థలంలోనే చనిపోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అలాగే ముగ్గురు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోటు కార్మికుల మృతి.. తిరుచానూరులో ఉన్న మిగిలిన పోటు కార్మికుల్లో విషాదాన్ని నింపింది.

## ఎన్నికల బందోబస్తు విధులలో సిబ్బంది అప్రమత్తంగా, క్రమశిక్షణతో వ్యవహరించాలి

-జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్





**వికారాబాద్, డిసెంబర్,09(సమయం న్యూస్) :** డిసెంబర్ 11, 2025 న జిల్లాలో జరగనున్న మొదటి దశ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఈ రోజు జిల్లా కార్యాలయంలో ఎన్నికల విధులలో పాల్గొనబోయే ఏ ఆర్ సిబ్బందికి, హోం గార్డ్స్ సిబ్బంది సలహాలు,సూచనలు ఇవ్వడం జరిగింది ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను కాపాడడంలో పోలీస్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని ఎస్పీ తెలిపారు. బందోబస్తు విధులలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా, పూర్తి అంకితభావం, క్రమశిక్షణతో తమ బాధ్యతలను నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు.సిబ్బంది విధి నిర్వహణలో ప్రదర్శించాల్సిన అత్యంత ముఖ్యమైన అంశాలను ఆమె ప్రస్తావించారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఎన్నికల కోడ్ (ఎంసీసీ) నియమాలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఏవైనా ఇబ్బందులు లేదా ఆకస్మిక సమస్యలు ఎదురైతే, వాటిని వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వ్యక్తిగతంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్పీ సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల భద్రత అనేది ఒక సమష్టి బాధ్యత అని, దీనిని విజయవంతం చేయడంలో సిబ్బంది పూర్తి సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ కోరారు.ఎన్నికల విధులలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, నిబంధనలను ఉల్లంఘించినా లేదా క్రమశిక్షణారాహిత్యాన్ని ప్రదర్శించినా దానిని అత్యంత తీవ్రమైన చర్యగా పరిగణించడం జరుగుతుందని, వారిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, ఆర్ ఐ డేవిడ్ , సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ మాధురి



**సంగారెడ్డి, డిసెంబర్ 9:( సమయం న్యూస్) :**సంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని అడిషనల్ కలెక్టర్ మాధురి ( రెవెన్యూ )ఆవిష్కరించారు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అధికారులు, డిఆర్ఓ, కలెక్టరేట్ లోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల సందర్భంగా వివిధ గ్రామాల్లో అభ్యర్థుల తరపున ప్రచారం

● కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**దౌల్తాబాద్ మండలం, డిసెంబర్,09(సమయం న్యూస్ :** కొడంగల్ నియోజకవర్గం లోని దౌల్తాబాద్ మరియు యంకి, ఇండాపూర్ గ్రామల్లో సర్పంచ్ ఎన్నికల సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని సపోర్ట్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నప్పుడు గ్రామాలకు చాలా అభివృద్ధి పథకాలు అందించారు వీటిల్లో ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతుబంధు రైతు బీమా మరియు ఎరువులు అందించడం, రైతులు పండించిన వడ్లు కొనుక్కోవడం వంటివి చేశారు అలాగే గ్రామాల్లో పచ్చదనాన్ని పెంచుతూ ఇతర అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో చేశారు రోడ్లు నీళ్లు ప్రజలకు సమస్యలను పరిష్కరించారు.అలాగే ముందుచూపుతో ఇప్పుడు జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో మన పార్టీ అభ్యర్థి అయినటువంటి వాళ్లను గెలిపించాలని వాళ్ల వల్ల గ్రామాల అభివృద్ధి జరుగుతుందని వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఏలాంటి అభివృద్ధి అయినా కేసీఆర్ తోనే సాధ్యమని అన్నారు. ఓటు వేసే ముందు ఒక్కసారి ఆలోచించండి సరైన అభ్యర్థిని ఎన్నుకోండి మన గ్రామ అభివృద్ధి మనకు ముఖ్యమని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ప్రజల వద్ద వ్యాఖ్యానించారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలన జరపాలి

- మైక్రో అబ్జర్వర్ల శిక్షణ తరగతుల్లో అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్
- ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైనది.
- జనరల్ అబ్జర్వర్ కార్తీక్ రెడ్డి




**సంగారెడ్డి, డిసెంబర్ 09( సమయం న్యూస్)** ఎన్నికలలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలన జరపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు తు.చ తప్పకుండా అమలయ్యేలా ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికల ప్రక్రియ జరిగేలా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపేందుకు వీలుగా నియమించబడిన మైక్రో అబ్జర్వర్లకు మంగళవారం కలెక్టెట్ లోని గ్రీవెన్స్ హాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు కార్తీక్ రెడ్డి శిక్షణ కార్యక్రమానికి విచ్చేసి మైక్రో అబ్జర్వర్లకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, సూక్ష్మ పరిశీలకుల ర్యాండమైజేషన్ ప్రక్రియను అనుసరిస్తూ మైక్రో అబ్జర్వర్లకు ఆయా ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలలో పరిశీలన బాధ్యతలు కేటాయించడం జరుగుతుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, అప్పుడే పోలింగ్ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించగల్గుతారని అన్నారు. ముఖ్యంగా పోలింగ్ కు ముందు రోజు ఉదయం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ కు చేరుకొని పోలింగ్ సిబ్బందికి అందించే సామాగ్రి సక్రమంగా అందినదా లేదా అన్నది పరిశీలించాలని,పిమ్మట పోలింగ్ సిబ్బందితో కలిసి పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ నిబంధనలకుఅనుగుణంగా, పూర్తి పారదర్శకంగా జరుగుతోందా లేదా అన్నది నిశిత పరిశీలన చేయాలని, గమనించిన అంశాలను జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర అధికారులు నిర్వర్తిసున్న విధులను గమనించాలని, పోలింగ్ ప్రారంభమైనప్పటి నుండి పూర్తయ్యేంత వరకు అన్ని అంశాలను గమనిస్తూ, ఎప్పటి కప్పుడు వాటిని జనరల్ అబ్జర్వర్ దృష్టికి తీసుకెళ్లాలని, ఓటింగ్ గోప్యతను కాపాడే విధంగా మైకో అబ్జర్వర్లు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలలో మరింత ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, పోలింగ్ కేంద్రం బయట, పరిసర ప్రాంతాల్లోనూ జరిగే అంశాలను గమనిస్తూ జాగరూకతతో వ్యవహరించాలని అన్నారు.ఎన్నికల సాధారణ అబ్జర్వర్ కార్తిక్ రెడ్డి మాటాడుతూ, ఎన్నికలలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైనదని, మైక్రో అబ్జర్వర్స్ నిబద్ధతతో అంకిత భావంతో పనిచేయాలన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న వారు మినహా, ఇతరులెవరిని పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదన్నారు.అన్ని అంశాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని తదనుగుణంగా విధులు నిర్వహించాలని మైక్రో అబ్జర్వర్లకు సూచించారు. శిక్షణ తరగతుల్లో జడ్పీ సీఈవో ఇన్చార్జి డిపిఓ జానకి రెడ్డి,శిక్షణ తరగతుల నోడల్ అధికారి మరియు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ , మాస్టర్ ట్రైనర్, మైక్రో అబ్జర్వర్లు, పాల్గొన్నారు.

## వేడుకల నిర్వహణ లో మహిళలను అభినందించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.

● శిక్షణలో పాల్గొన్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేత



**కామారెడ్డి డిసెంబర్9( సమయం న్యూస్). :** నిర్వహించబడే వివిధ వేడుకలు, కార్యక్రమాల నిర్వహణలో మహిళల ప్రతిభను అభినందిస్తూ, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో సర్టిఫికెట్స్ అందజేశారు.

ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు ఐదు రోజుల ఈవెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ విజయవంతంగా పూర్తి చేసిన మహిళలను కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు.మహిళలకు అవకాశం ఇస్తే ఏ రంగంలోనైనా రాణించగలరని, జిల్లాలో జరిగే వేడుకలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను వీరే చేపట్టేలా అవకాశాలు కల్పించాలని డిఆర్డీఓకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మహిళా సభ్యులకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, సాయిలు, రాజేందర్, అలాగే మహిళా సభ్యులు జమున, లత, అనంతలక్ష్మి, ప్రమీల, ఇందిరా, సునీత తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ విధులను పారదర్శకంగా నిర్వహించాలి

● కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి




**నిజామాబాద్, డిసెంబర్ 09 ( సమయం న్యూస్) :** పోలింగ్ విధులను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రెండవ విడతగా గ్రామ పంచాయతీ ఎన్నికల విధులలో పాల్గొనే ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శనివారం నిజామాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ పోలింగ్ విధులను నిర్వహించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న తప్పిదానికి సైతం ఆస్కారం కల్పించకూడదని అన్నారు. ఓటరు జాబితాను పక్కాగా పరిశీలించుకోవాలని, ఆ జాబితాకు అనుగుణంగా ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పాటిస్తూ, సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, పోలింగ్ మెటీరియల్ ను తీసుకోవాలని అన్నారు. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రి ఉందా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అనంతరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను చక్కబెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. సీటింగ్ అరేంజ్ మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్మెంట్ వంటి వాటిని నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఓటింగ్ విషయంలో నూటికి నూరు శాతం గోప్యత అమలు జరిగేలా చూడాలన్నారు. ఓటరు ఐ.డీ, ఆధార్ కార్డులే కాకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటరు ఓటు వేయవచ్చని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి బ్యాలెట్ పత్రం పొందిన ఓటరు తప్పనిసరిగా ఆ పత్రాన్ని బ్యాలెట్ బాక్సులో వేసి ఓటు హక్కు వినియోగించుకునేలా నిశిత పరిశీలన చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఒక్క బ్యాలెట్ పత్రం కూడా బయటకు వెళ్లకూడదని కలెక్టర్ జాగ్రత్తలు సూచించారు. టెండర్ ఓటుకు ఆస్కారం లేకుండా పక్కాగా పరిశీలన జరపాలని సూచించారు. స్టేజ్–2 అధికారులు మినహా మిగతా మరెవరి వద్ద కూడా సెల్ ఫోన్లు ఉండకూడదని, పోలింగ్ కేంద్రం బయట సెల్ ఫోన్లను తీసుకుని భద్రపర్చేలా కౌంటర్ ఏర్పాటు చేయించాలని అన్నారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే పోలింగ్ కేంద్రాల లోపలికి వెళ్లేందుకు అనుమతించాలని అన్నారు. ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతీ పీఓ క్షుణ్ణంగా చదివి స్పష్టమైన అవగాహన ఏర్పరచుకోవాలని, పోలింగ్ విధుల సందర్భంగా అన్ని నిబంధనలను పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను యధాతథంగా అమలు చేయాలే తప్ప, సొంత నిర్ణయాలకు తావు కల్పించకూడదని హితవు పలికారు. ఎన్నికల విధులలో అనవసర పొరపాట్లకు ఆస్కారం కల్పిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సాఫీగా జరిగి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా పూర్తయ్యేలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలిస్తూ కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని పీ.ఓలకు సూచించారు. కాగా, పోలింగ్ శాతం, ఓట్ల లెక్కింపు వివరాల ప్రకటనలో తొందరపాటు ప్రదర్శించకూడదని, పక్కాగా నిర్ధారణ చేసుకున్న తరువాతనే ఓటింగ్ శాతాన్ని, కౌంటింగ్ వివరాలను వెల్లడించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ లు నెలకొల్పి ఓటర్లకు సహాయపడేలా బీ.ఎల్.ఓలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, ముందుగానే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను ఎవరు కూడా ప్రలోభాలకు గురి చేయకుండా చూడాలన్నారు. ఇదిలాఉండగా, డిచ్పల్లి మండల కేంద్రంలో పీ.ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఎన్నికల సాధారణ పరిశీలకులు జీ.వీ.శ్యాంప్రసాద్ లాల్ పాల్గొని సూచనలు చేశారు. శిక్షణ తరగతుల్లో స్థానిక అధికారులు, స్టేజ్ –2 రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించిన: సీఐ శివశంకర్

● జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు



**నారాయణపేట, డిసెంబర్,09(సమయం న్యూస్) :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేయడానికి నారాయణపేట సీఐ శివశంకర్, రూరల్ ఎస్సై రాముడు లు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.జాజాపూర్, అభంగాపూర్, కోటకొండ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించి అక్కడి ఏర్పాట్లు, భద్రతా పరిస్థితులను సమీక్షించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత ఎస్సై, స్టేషన్ సిబ్బందికి సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద నిర్దిష్ట దూరంలో మార్కింగ్ చేయించి, ప్రచారం, పార్టీ గుర్తులను ప్రదర్శించడం పూర్తిగా నిషేధించాలనీ, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.ఎన్నికలను ప్రభావితం చేసే డబ్బు, మద్యం, ఇతర అక్రమ రవాణా పై నిఘా ఉంచేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని విలేజ్ పోలీస్ అధికారులు ముందస్తు సమాచారాన్ని సేకరించి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని సూచించారు.పోలింగ్ రోజున సమస్యాత్మక కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయబడుతుందని, ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ శివశంకర్ తెలిపారు.

# వికారాబాద్ జిల్లాలో మొదటి దశ పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ సమీక్ష.

- సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుదోవ పట్టించే లేదా
- తప్పుడు సమాచారం(ఫేక్ న్యూస్) పట్ల అప్రమత్తంగా ఉండాలి-ఎస్పీ




**వికారాబాద్, డిసెంబర్,09(సమయం న్యూస్) :** జిల్లాలో జరగబోయే మొదటి దశ పంచాయతీ ఎన్నికల కోసం జిల్లా పోలీసుల సన్నద్ధతను సమీక్షించి, మరింత బలోపేతం చేసేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ మంగళవారం వికారాబాద్ జిల్లాలోని అన్ని పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సమావేశంలో, ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించడానికి సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఎస్పీ వివరణాత్మక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో మరియు వాటి పరిసర ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా సిబ్బందిని మోహరించాల్సిన అవసరాన్ని ఎస్పీ తెలిపినారు. మద్యం, డబ్బు లేదా ఇతర ప్రలోభాల పంపిణీ వంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, పర్యవేక్షించి, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.వాహన తనిఖీలను, చెక్ పోస్టుల వద్ద తనిఖీలను మరియు సున్నిత ప్రాంతాలలో నిఘాను ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుదోవ పట్టించే లేదా తప్పుడు సమాచారం (ఫేక్ న్యూస్) పట్ల అప్రమత్తంగా ఉండాలని మరియు దాని వ్యాప్తిని నిరోధించడానికి సకాలంలో చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోరారు.పోలింగ్ రోజున, ఓటర్లు తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకునేటప్పుడు ఎటువంటి అసౌకర్యాన్ని ఎదుర్కోకుండా భద్రతా సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ తెలిపినారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ( కఠినంగా అమలు చేయవలసిన ప్రాముఖ్యతను ఆమె తెలిపినారు. తమ పాత్రలు మరియు బాధ్యతలపై సంపూర్ణ స్పష్టత ఉండేలా, ఎన్నికల విధుల్లోని సిబ్బందికి చేయదగినవి మరియు చేయకూడని వాటి గురించి పూర్తిగా వివరించాలని అధికారులందరికీ ఆదేశాలు జారీ చేశారు."వికారాబాద్ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎటువంటి ఆటంకం లేకుండా జరిగేలా చూడటం మన ప్రాథమిక బాధ్యత. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి అధికారులు అత్యంత అంకితభావంతో, సామర్థ్యంతో మరియు ధైర్యంతో తమ విధులను నిర్వహించాలి," అని ఎస్పీ పేర్కొన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ ఎస్పీ బి. రాములు నాయక్, డీసీఆర్‌బీ డీఎస్పీ జనయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు,వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ సరోజా,ఎస్.బీ.ఐ. డీవీపీ రాజు, జిల్లాలోని సబ్-డివిజనల్ డీఎస్పీలు మరియు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# శాంతియుత ఎన్నికల కోసం, ప్రజలు-అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్.



**నారాయణపేట, డిసెంబర్,09(సమయం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు ప్రతి పౌరుడు, ప్రతి అభ్యర్థి బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య పండుగగా భావించే ఎన్నికలు ఎలాంటి అశాంతి, ఉద్రిక్తతలు లేకుండా సాగేందుకు నిబంధనలు పాటించడం అత్యంత అవసరమని తెలిపారు. రాత్రివేళ గుంపులుగా తిరగడం, మద్యం సేవించి గొడవలకు దిగడం, ఓటర్లను బెదిరించడం, డబ్బు లేదా బహుమతులతో ఓట్లను ప్రభావితం చేయడం వంటి చర్యలు తీవ్ర నేరాలుగా పరిగణించి నిర్బంధంగా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.సోషల్ మీడియా...ఆన్‌లైన్‌లో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు, ద్వేషపూరిత వ్యాఖ్యలు, వీడియోలను షేర్ చేయడం ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే చర్యలుగా భావిస్తామని, అటువంటి సోషల్ మీడియా దుర్వినియోగం జరిగితే చట్టం కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియలో ఏవైనా అనుమానాస్పద కదలికలు, అనుచిత ప్రభావం, బెదిరింపులు గమనించిన వెంటనే డయల్ 100 నెంబర్ లేదా జిల్లా కంట్రోల్ రూమ్ 8712670399 కు కాల్ చేయాలని ప్రజలను కోరారు. ఎన్నికల కాలంలో నమోదైన ఏదైనా క్రిమినల్ కేసులు భవిష్యత్తులో ఉద్యోగాలు, పాస్‌పోర్ట్, విదేశీ అవకాశాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. అభ్యర్థులు మరియు ప్రచార బృందాలు అనుమతుల్లో పేర్కొన్న పరిమితుల్లోనే ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని, కులం లేదా మతాన్ని ప్రాతిపదికగా చేసుకుని చేసే ప్రచారం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. రాత్రివేళ సౌండ్ సిస్టమ్స్ వాడరాదని, ప్రచార వాహనాల వివరాలు, ప్రచార పత్రాలు తనిఖీకి సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో కేసులు నమోదు చేయడంతోపాటు, అభ్యర్థిత్వం రద్దు చెందే అవకాశమూ ఉంటుందని స్పష్టం చేశారు .50,000 రూపాయలకంటే ఎక్కువ నగదు తీసుకెళ్లేవారు తప్పనిసరిగా దానికి సంబంధించిన ఆధారాలు వెంట పెట్టుకోవాలని, లేనిపక్షంలో నగదు సీజ్ చేయబడుతుందని తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా, పారదర్శకతతో సాగేందుకు ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని ఎస్పీ పునరుద్ఘాటించారు.

**సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమలు:**

గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు డిసెంబర్ 11న జరగనున్న నేపథ్యంలో, కోస్గి, గుండుమల్, కొత్తపల్లి, మద్దూర్ మండలాల్లో డిసెంబర్ 9న సాయంత్రం 5 గంటల నుండి ఫలితాలు ప్రకటించే వరకు సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ ఆంక్షల కాలంలో నలుగురికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధం. ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తం చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారితీసే ప్రవర్తన ఏదైనా చోటుచేసుకున్నట్లయితే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్నికల సమయంలో ఊరేగింపులు, ర్యాలీలు, సమావేశాలు చట్టపరమైన అనుమతిలేకుండా చేపట్టకూడదని, పోలింగ్ కేంద్రాలకు ఒక కిలోమీటర్ పరిధిలో కర్రలు, కత్తులు, తుపాకులు లేదా ఎలాంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. తాత్కాలిక నిర్మాణాలు అయిన షామియానాలు, పందిళ్లు ఏర్పాటు చేయడానికి కూడా అనుమతి తప్పనిసరి అని చెప్పారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల ద్వారా పాటలు ప్రసారం చేయడం, సభలు నిర్వహించడం, ప్రజలను ఒక వర్గం మీద మరొక వర్గం మీద రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేయడం నిషేధమని తెలిపారు. ఎన్నికల సమయంలో చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే విధమైన ప్రకటనలు, ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించడం కూడా చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు.డ్రై డే అమలు: ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలు కాపాడేందుకు, విభేదాలు లేకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడే వరకు ఆయా మండలాల్లో మద్యం విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు, అభ్యర్థులు నిబంధనలు గౌరవించి పోలీసులకు సహకరిస్తే ఎన్నికలు మరింత ప్రశాంతంగా సాగుతాయని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ సన్నద్ధం

- అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్
- ప్రజల భద్రత, తక్షణ స్పందన కోసం, మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహణ.





**కోస్గి మున్సిపల్(మం)డిసెంబర్,09(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ మరియు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు శాంతియుత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్ తెలిపారు.బుధవారం కోస్గి సర్కిల్ పరిధిలోని పోలీసులకు మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది అని తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, పోలీసు సిబ్బందికి మాబ్ కంట్రోల్‌లో అనుసరించాల్సిన విధానాలు, కార్యాచరణ ప్రణాళికలు, గందరగోళ లేదా అత్యవసర పరిస్థితులు నెలకొన్నప్పుడు తక్షణ స్పందన సామర్థ్యం, ప్రజల ప్రాణ రక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వబడిందని ఆయన పేర్కొన్నారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఫుట్ ఫార్మేషన్, టీమ్ కోఆర్డినేషన్,హెచ్చరిక విధానాలు, చట్టపరమైన చర్యల అమలు పద్ధతులు వంటి అంశాలను సిబ్బంది ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. ఈ శిక్షణ ద్వారా పోలీసులు అత్యవసర పరిస్థితుల్లో మరింత చాకచక్యంగా, సురక్షితంగా ఎలా స్పందించాలో అవగాహన పొందారని అదనపు ఎస్పీ తెలిపారు.ప్రజల భద్రత పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, ప్రొఫెషనలిజం, సేవాభావంతో మాబ్ కంట్రోల్ నిర్వహించగలగాలి అని తెలిపారు. ఇలాంటి మాక్ డ్రిల్లులు క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా సిబ్బంది స్పందనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు స్మోక్ గన్స్ మాబ్ పై ఫైర్ చేశారు మరియు ఫైర్ ఇంజన్ ద్వారా మాబ్ పై వాటర్ ను ఎలా ఫైర్ చేయాలి, అనంతరం వేపెన్స్ తో ఫైర్, ఎలాంటి పరిస్థితుల్లో ఏ విధమైన ఫైర్ వాడాలి అనే అంశాలను లైవ్ గా డెమో చేసి చూపించారు. దీనితో పోలీసు సిబ్బంది అనుభవం మరింత పెరిగిందని అధికారులు తెలిపారు.ఈ మాక్ డ్రిల్‌లో కోస్గి సిఐ సైదులు, ఎస్సై లు బాలరాజు, విజయ్ కుమార్,ఆర్ ఎస్సై లు శివశంకర్, మద్దయ్య, శిరీష, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన-కలెక్టర్ ప్రతిక్ జైన్




**వికారాబాద్, డిసెంబర్,09(సమయం న్యూస్):** మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్ లతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొ న్నారు.ఈ సందర్భంగా సంఘం లక్ష్మీబా యి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠ శాల విద్యార్థినిలు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకర్షించ బడ్డాయి.

## కలెక్టరేట్ సముదాయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ.

- మేడ్చల్ మల్కాజి గిరి



**డిసెంబర్9( సమయం న్యూస్) :** మంగళవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(ఐడిఓసి) ఆవరణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాంప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.తెలంగాణ సాంస్కృతిక కళాకారులు ఆలపించిన ప్రభుత్వ ప్రజా పాలన, సంక్షేమం పై పాడిన పాటలు అందరిని ఎంతగానో అలరించాయి.

## ఎలాంటి అలజడులు లేకుండా ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణనే లక్ష్యం

- కోస్గి సీఐ సైదులు
- నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు



**గుండుమాల్ మండలం, డిసెంబర్,09(సమయం న్యూస్) :** గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా, ప్రజల్లో భద్రతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో కొడంగల్ నియోజకవర్గం కోస్గి సర్కిల్ పరిధిలోని గుండుమల్ మండలం, దొరేపల్లి గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కోస్గి సీఐ సైదులు ఆధ్వర్యంలో లోకల్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు ఈ మార్చ్‌లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కోస్గి సీఐ మాట్లాడుతూ... గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా, శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ ఫ్లాగ్ మార్చ్ ప్రధాన ఉద్దేశం ప్రజలలో ధైర్యాన్ని నింపి, చట్టాన్ని ఉల్లంఘించాలని చూసే అసాంఘిక శక్తులకు, రౌడీషీటర్లకు బలమైన హెచ్చరిక పంపడమేనని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సున్నితమైన మరియు అతి-సున్నితమైన గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రజలకు కీలక సూచనలు చేస్తూ, ముఖ్యంగా క్రిటికల్ గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా, ఇతరులను భయపెట్టేందుకు ప్రయత్నించినా, లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. గ్రామాలలో శాంతిభద్రతలను కాపాడడంలో కేవలం పోలీసుల పాత్రే కాక, ప్రజల సహకారం కూడా ఎంతో ముఖ్యమని తెలిపినారు. పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి, అండగా ఉంటుందని, ప్రజలు నిర్భయంగా ఓటు వేయడానికి అవసరమైన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.ఎస్సైలు బాలరాజు, విజయ్ కుమార్, శిరీష లోకల్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ధాన్యం కేటాయింపుకు బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం, డిసెంబర్ 9 : ( సమయం న్యూస్ ) :** జిల్లాలోని రైస్ మిల్లర్లకు వరి ధాన్యం కేటాయింపు చేసేందుకు బ్యాంకు గ్యారంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చూపించడం తప్పనిసరి అని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో రైస్ మిల్లర్ల తో ధాన్యం కేటాయింపు, బ్యాంక్ గ్యారంటీ, పెండింగ్ సిఎంఆర్ రైస్ డెలివరీపై అదనపు కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మిల్లులకు సరఫరా చేసే ధాన్యానికి బ్యాంకు గ్యారంటీ, సెక్యూరిటీ డిపాజిట్ తప్పనిసరి అని అన్నారు. రైస్ మిల్లులు అందజేసిన బ్యాంకు గ్యారంటీ ఆధారంగా కేటాయింపులు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి 2024-25 పంటకు సంబంధించి డిసెంబర్ 8 వరకు జిల్లాలో పెండింగ్ ఉన్న 12 శాతం సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో యాసంగి సీజన్ కు సంబంధించి 1,07,676 మెట్రిక్ టన్నులు సి.ఎం.ఆర్. రైస్ డెలివరీ లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 95 వేల 100 మెట్రిక్ టన్నులు సిఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేశారని, పెండింగ్ 12 వేల 576 మెట్రిక్ టన్నులు పూర్తి చేయాలని అన్నారు. అనంతరం రైస్ మిల్లుల వారీగా పెండింగ్ ఉన్న సి.ఎం.ఆర్. రైస్ డెలివరీ, బ్యాంక్ గ్యారంటీపై అదనపు కలెక్టర్ సమీక్షించి, వెంటనే బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని, పెండింగ్ రైస్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర రావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక పద్ధతుల్లో డంపింగ్ యార్డ్

● వ్యర్థాలతొలగింపు - తాండూరు మున్సిపల్ కమిషనర్ యాదగిరి.



**తాండూరు మున్సిపల్(డిసెంబర్,09(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ డంపింగ్ యార్డ్ లో సంవత్సరాల తరబడిగా పేరుకుపోయిన వ్యర్థాలను ఆధునిక యంత్రం ద్వారా తొలగిస్తున్నట్లు తాండూర్ మున్సిపల్ కమిషనర్ యాదగిరి వెల్లడించారు. మంగళవారం ఆయన మంగళవారం ఆయన డి. ఈ మణిపాల్, ఏ ఈ ఖాజా హుస్సేన్, ఉదయ్ కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ గౌడ్, ఇంచార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ ఎం వెంకటయ్య ల తో కలిసి డంపింగ్ యార్డ్ లోని బయో మైనింగ్ ఆధునిక యంత్రాన్ని పరిశీలించారు. బయో మైనింగ్ అనేది చెత్త నిలువలను బయో మైనింగ్ అనేది చెత్త నిలవలను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరచి ఆధునిక విధానమని కమిషనర్ వివరించారు.ప్రస్తుతం డంపింగ్ యార్డ్ లో పేరుకపోయిన వ్యర్థాలను ఆధునిక యంత్రాల సహాయంతో వడకట్టి తిరిగి ఆ వ్యర్థాలను ఉపయోగించగల పదార్థాలను వేరు చేసే ప్రక్రియ ఈ యంత్రంలో ఉందని చెప్పారు. ఈ ప్రక్రియలో మట్టి, ప్లాస్టిక్, ఇనుము, గాజు, పరిశ్రమల్లో ఉపయోగపడే ఆర్డిఎఫ్ వంటి విలువైన పదార్థాలు తిరిగి పొందపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ద్వారా బయో మైనింగ్ తో డంపింగ్ యార్డ్ పరిమాణం తగ్గి పర్యావరణ కాలుష్యం కూడా తగ్గుతుందని ఆయన వివరించారు. భూ, వాయు కాలుష్యాలు తగ్గడంతో పాటు చెత్త దుర్వాసన, దోమల సమస్యలు తగ్గి ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఆయన చెప్పారు. ఇది స్వచ్ఛమైన, సుస్థిరమైన పట్టణాల నిర్మాణానికి దోదపడుతుందన్నారు.

# బానోతుఅనసూర్య బాయి కు ఎల్ హెచ్ పి ఎస్ పూర్తి మద్దతు

● రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్

**ఖమ్మం , డిసెంబర్ 9 : ( సమయం న్యూస్ ) :** రఘునాధపాలెం మండలంలోనిఈర్ల పూడి గ్రామ గ్రామపంచాయతీ ఎన్నికలలోసర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బానోతు అన సూర్య బాయి కు ఎల్ హెచ్ పి ఎస్ (లంబాడి హక్కుల పోరాట సమితి) సంపూర్ణ మద్దతును ప్రకటిస్తుందని ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ మంగళవారం విడుదల చేసినఒక ప్రకటన లోతెలిపారు. ఈర్లపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ గా మదన్ లాల్ గ్రామ అభివృద్ధికి పాటుపడిన విషయం అందరికీ తెలిసిందేనని , ఆకుటుంబంనుంచి మరోసారి గ్రామ అభివృద్ధికి కృషి చేసేందుకు అన్న సూర్య బాయి సర్పంచ్ అభ్యర్థిగా పోటి చేస్తున్నారని, ఈర్లపూడి పంచాయితీ అభివృద్ధికి గాను ఆమెకు ఎల్ హెచ్ పి ఎస్ తన మద్దతును ప్రకటించినందని , గ్రామ ప్రజలు కూడా నాకు మద్దతు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ గా , వైరా ఎమ్మెల్యేగా మదన్ లాల్ చేసిన సేవలు , అభివృద్ధి కోసం పాటుపడిన తీరు తెన్నులు ఇప్పటికీ మర్చిపోలేని విధంగా ప్రజల హృదయాలలో నిలిచిపోయాయని పేర్కొన్నారు. మదన్ లాల్ యావత్తు కుటుంబం రాజకీయనేపథ్యం గలదని , మాట ఇస్తే మడమ తప్పని మనస్తత్వంవాళ్ళదని , కాబట్టి ఇళ్లపూడి గ్రామ ప్రజలు బాగా ఆలోచించి , వీర్లపూడి గ్రామా పంచాయితీ అభివృద్ధికి పాటుపడే అన సూర్య బా యి కుమద్దతు పలికి , గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మదన్ లాల్ తరహా లోనే అన సూర్య బాయికూడా తనదైన శైలిలో అభివృద్ధి బాటలు ఏర్పరుస్తూ ముందు సాగుతారని ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ ప్రకటిస్తూ త్వరలో జరగబోయే పంచాయతీ పోలింగ్ లో అన సూర్యకు అనుకూలంగా ఓట్లు వేసి భారీ మెజార్టీతో సర్పంచ్ గా గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈర్లపూడగ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పంచాయితీ ఎన్నికల బరిలో బరిలో నిలుచున్న బానోతు అన సూర్య బాయి గుర్తు ఉంగరం పై ఓటు ముద్ర వేసి , సర్పంచ్ గా అన సూర్య కు ఆమోదం పలకాలనిబద్రు నాయక్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

# గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల ప్రజలకు నమస్కారం.



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 9 :** రాబోయే స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యుల వంటి బాధ్యతాయుతమైన పదవులకు యువతకు అవకాశం కల్పించాలని మనవి చేస్తున్నాము. అవినీతిపరులకు అవకాశం ఇవ్వకుండా, గ్రామ సమస్యలపై పూర్తి అవగాహన కలిగి వాటిని పరిష్కరించే సామర్థ్యం ఉన్న నిజాయితీ గల నాయకులను ఎన్నుకోవాలి .అలాగే, మెదక్ ఎంపీ శ్రీ రఘునందన్ రావు పేర్కొన్నట్లుగా, భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపిస్తే ఎంపీ నిధుల నుండి రూ.25 లక్షలు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి సహాయపడుతామని హామీ ఇచ్చారు. ఇది ప్రధానంగా గ్రామాల యువతకు మంచి అవకాశం.ఇప్పటికే గ్రామ పంచాయతీలకు వచ్చే నిధుల్లో కేంద్ర ప్రభుత్వ వాటా అత్యధికమని తెలియజేశారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు లోనుకాకుండా, ఓటు అనే శక్తివంతమైన ఆయుధంతో మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాము.

# పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదిరిపాడు నందు ఘనంగా స్పోర్ట్స్ మీట్





**మద్దూరు మండలం, డిసెంబర్,09(సమయం న్యూస్) :** పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నారాయణపేట జిల్లా మద్దూరు మండలం మంగళవారం పెదిరిపాడు పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం జరిగింది. పిఎంశ్రీ పాఠశాలల్లో ప్రాజెక్టు ఇన్నోవేషన్ లో భాగంగా పాఠశాలలో స్పోర్ట్స్ మీట్ ను సెక్టోరియల్ అధికారులు రాజేంద్ర కుమార్ కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్, విద్యాసాగర్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, శ్రీనివాస్ సెక్టోరియల్ అధికారి మరియు యాదయ్య శెట్టి మధ్యాహ్న జిల్లాభోజన ఇంచార్జ్ ప్రారంభించడం జరిగింది.పాఠశాలలో విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ హౌస్ లవారిగా నిర్వహించడం జరిగింది. స్పోర్ట్స్ మీట్ లో భాగంగా కొక్కో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్ బాల్, రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్ త్రో, క్రీడలను అండర్ 17 గ్రూపు విద్యార్థులకు నిర్వహించడం జరిగింది.సెక్టోరియల్ అధికారులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో మరియు రాష్ట్రస్థాయిలో క్రీడల్లో నారాయణపేట జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించడం జరిగింది. అలాగే క్రీడలు మానసిక శారీరక శ్రమను పెంపొందిస్తాయని వివరించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకిష్టప్ప, శ్రీనివాసులు,భాస్కర్,రాజారత్నం, శబరి, రవీందర్ నాయక్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ కృష్ణవేణి మరియు మల్లిక పాల్గొనడం జరిగింది.

# బిఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించండి వంటేరు ప్రతాపరెడ్డి



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 9 :** గజ్వేల్ మండలంలోని అహ్మదీపూర్, సింగాటం, పిడిచెడ్, అనంతరావుపల్లి గ్రామాలలో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు బ్యాగరి కరుణాకర్, ములుగు మల్లేశం, హనుమంత్ రెడ్డి, గమనమైన కవిత కు మద్దతు తెలుపుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించిన గజ్వేల్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఈ సందర్భంగా వంటేరు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు నేడు అబద్దాల పునాదుల మీద అసత్యపు హామీల మీద రాజ్యమేలుతున్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలలో పూర్తిగా విఫలమైందని తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు మహిళలకు 2500, వృద్ధులకు 4000, దివ్యాంగులకు 6000, ఆడబిడ్డల పెళ్ళికి తులం బంగారం, రైతు భరోసా 15000, నిరుద్యోగులకు ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు, విద్యా ర్థినిలకు స్కూటీల పంపిణీ, విద్యా భరోసా కార్డు కింద ప్రతి విద్యార్థికి ఐదు లక్షల రూపాయలు, కౌలు రైతులకు 12,000, కూలీ రైతులకు 12,000, ఆటో డ్రైవర్లకు 12000, అబద్ధపు హామీ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు అంతేకాకుండా రైతులకు యూరియా సరఫరా చేయడంలో నాణ్యమైన ఎరువులు అందించడంలో రైతులకు 24 గంటల కరెంటు అందించడంలో పూర్తిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని తెలిపారు సర్పంచ్ ఎన్నికలలో ఇంటికి వచ్చే కాంగ్రెస్ అభ్యర్థులను ఇచ్చిన హామీలపై నిలదీసి ప్రశ్నించాలని వంటేరు ప్రతాపరెడ్డి ప్రజలను కోరారు కాంగ్రెస్ అంటేనే జూటపాటి అని అవినీతి అక్రమాలు అని తెలిపారు ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలకు ఒక్క రూపాయి కూడా అభివృద్ధికి ఖర్చు చేయకపోవడం చాలా దారుణమని మండిపడ్డారు

కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలు అపరిశుభ్ర గ్రామాలుగా మారాయని గ్రామాలలో డెంగ్యూ టైఫాయిడ్ జ్వరాలు ప్రబలి చాలామంది చనిపోయారని తెలిపారు నాడు కెసిఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని పల్లెలన్నీ సస్యశ్యామలంగా ఆరోగ్య గ్రామాలుగా పరిశుభ్ర గ్రామాలుగా ఉండేవని తెలిపారు రైతుబంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్లు, కెసిఆర్ కిట్టు, షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి, 24 గంటల ఉచిత కరెంటు, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నల్ల నీరు, తడి చెత్త పొడి చెత్త సేకరణ ట్రాక్టర్లు, వైకుంఠధామాల నిర్మాణం, ప్రకృతి వనల ఏర్పాటు, క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు, రైతు వేదికల నిర్మాణం, నూతన గ్రామ పంచాయతీల నిర్మాణం, కుల సంఘ భవనాల నిర్మాణం, ఫంక్షన్ హాల్ నిర్మాణం, రైతులకు మండుటెండల్లో సైతం సాగునీరు అందించడానికి కొండం పోచమ్మ సాగర్ మల్లన్న సాగర్ లాంటి ప్రాజెక్టుల నిర్మాణం, బీసీ సంక్షేమం, ఎస్సీ సంక్షేమం లాంటి ఎన్నో రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నేరుగా అవినీతి లేకుండా గడపగడపకు అందించిన ఘనత గతంలోని కెసిఆర్ ప్రభుత్వాన్నిదని తెలిపారుఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాస శ్రీనివాస్, గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, గజ్వేల్ మాజీ జెడ్పిటిసి పంగా మల్లేశం, గజ్వేల్ మాజీ ఎంపీపీ దాసరి అమరావతి, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులున్నారు

# పంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, డిసెంబర్ 9: ( సమయం న్యూస్ ) :** పంచాయతీ ఎన్నికలను పూర్తిస్థాయిలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.డిసెంబర్ 11న మొదటి విడతలో నిర్వహించే గ్రామ పంచాయతీల ఎన్నికల సందర్భంగా చింతకాని, బోనకల్ మండలాలలో జిల్లా కలెక్టర్ మంగళవారం పర్యటించి, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాట్లను తనిఖీ చేశారు.

చింతకాని లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బోనకల్ మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సామాగ్రిని, పోస్టల్ బ్యాలెట్ పత్రాలను, పూర్తి సామాగ్రి ఉందో లేదో ఎలా సరిచూసుకోవడం, బ్యాలెట్ బాక్స్, ఓటర్ లిస్ట్, బ్యాలెట్ పేపర్స్ చెక్ చేసుకోవడం, పోలింగ్ రోజున ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునే విధంగా వాహనాల ఏర్పాటుకు రూట్ ఆఫీసర్లు భాధ్యత వహించాలని తెలియజేస్తూ అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.అనంతరం నాగులవంచ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సర్పంచ్, వార్డు మెంబర్ ల పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. ఓటర్లకు కల్పించే మౌళిక సదుపాయాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనదని, ప్రతీ అంశం పైన క్షుణ్ణంగా అవగాహన కల్పించుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామాగ్రి సేకరించడం, ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వడం, పివో డైరీ నింపడం, అన్ని ఫార్మ్స్ ఎలా నింపాలి, ఏజెంట్స్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్స్ కౌంటింగ్,సర్పంచ్ నియామక పత్రాలు ఇవ్వడం, తదితర అంశాల మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటనే బస చేయాలని తెలిపారు.డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాటు చేయాలని, అక్కడ అవసరమైన సదుపాయాలు భోజనం, పోలింగ్ సిబ్బందికి సునాయసంగా తెలిసేలా సైన్ బోర్డ్స్, వాహనాల పార్కింగ్ అవసరమైన స్థలం ఏర్పాటు చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన పోలింగ్ సిబ్బంది విధులకు హాజరయ్యే విధంగా రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్దే స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసి కౌంటింగ్ కు చర్యలు చేపట్టాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు పోలింగ్ బృందాలు చేరుకున్నాయో లేదో రిటర్నింగ్ అధికారి చెక్ చేయాలని, సరైన సమయానికి చేరుకునేలా ఫాలో అప్ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో అవసరమైన సామాగ్రి పంపిణీ చేసామో లేదో చెక్ చేయాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందు పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పోలింగ్ కు ముందు రోజు ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పోలింగ్ నాడు ఉదయమే సిబ్బంది పోలింగ్ స్టేషన్ వద్దకు చేరుకునేలా రూట్ ఆఫీసర్లు చూడాలని అన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా చేయాలని తొందర పడాల్సిన అవసరం లేదని, ప్రతి ఓటు చాలా కీలకమైన అంశంగా గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రిటర్నింగ్ అధికారులు నవీన్ బాబు, కె.విజయభాస్కరరెడ్డి, చింతకాని తహశీల్దార్, బోనకల్ తహశీల్దార్ పద్మ, ఎంపిడిఓలు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలలో అభ్యర్థులు సమన్వయంతో వ్యవహరించాలి

● పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, డిసెంబర్ 9 : ( సమయం న్యూస్ ) :** ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో అభ్యర్థులు సమన్వయంతో వ్యవహరించాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ ద త్ అన్నారు. మంగళవారం తిరుమలాయపాలెం మండలం ఎన్నికలలో సర్పంచ్ గానామినేషన్ వేసిన అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్నికేశవాపురం క్రాస్ రోడ్ గల అనూష ఫంక్షన్ హాల్ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూప్రజా స్వామ్యంలో ఎన్నికలు చాలా కీలకమని, వ్యక్తిగతదూషణ లకు వెళ్లకుండాఅందరూ సమన్వయం పాటించాలని అన్నారు.గ్రామాల్లో ఏదైనా ఘర్షణ వాతావరణం ఉంటే పోలీసులు సమాచారం ఇవ్వాలని సూచించారు.అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు గౌరవించి పోలీసులకు సహకరిస్తే ఎన్నికలు మరింత ప్రశాంతంగా సాగుతాయని అన్నారు.ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. నియమ నిబంధనలు పాటించకపోతే కేసులు సైతం నమోదు అవుతాయని తెలిపారు. అభ్యర్థులందరూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు జరుపుకోవాలని, ఎక్కడ కూడా శాంతిభద్రతల సమస్య రాకుండా పోలీసులు సూచనలు పాటించాలని అన్నారు. ముఖ్యంగా సెక్షన్ 163బి ఎన్ ఎస్ ఎస్యాక్ట్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికలు, ఫలితాల అనంతరం ఎలాంటి ర్యాలీలు గాని సమావేశాలకు గాని అనుమతి లేదని, ఇది గమనించి అందరూ సహకరించాలని అన్నారు. ఏసీపీ తిరుపతి రెడ్డి, సిఐ సంజీవ్, తిరుపతి రెడ్డి,ఎస్సై జగదీష్, లింగారెడ్డి పాల్గొన్నారు

# మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని.



**వికారాబాద్, డిసెంబర్,09(సమయం న్యూస్) :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు- 2025 లో ఈ నెల 11వ తేదీన జరగనున్న మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు.మంగళవారం హైదరాబాద్ నుండి ఎన్నికల సంఘం కమిషన్ సభ్యులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సాధారణ, వ్యయ పరిశీలకులు, జిల్లా పంచాయతీ అధికారులతో ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు తీసుకోవలసిన చర్యలు, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, ఓటర్ల ప్రభావిత అంశాలను అరికట్టడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడతలో రాష్ట్రంలోని 3 వేల 834 గ్రామపంచాయతీ సర్పంచ్, 27 వేల 628 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఇందు కొరకు 37 వేల 562 పోలింగ్ కేంద్రాలలో 56 లక్షల 19 వేల 430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. సర్పంచ్ స్థానానికి 12 వేల 960 మంది, వార్డు సభ్యుల స్థానానికి 65 వేల 455 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు. పంచాయతీ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ సమయాలలో జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత ఎన్నికలలో 225 గ్రామపంచాయతీ సర్పంచ్, 1912 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి పూర్తి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.45 మైక్రో అబర్జార్వర్లను నియమించడం జరిగిందని, స్టేజ్ 2 ఆర్. ఓ. లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, పోలింగ్, ఇతర పోలింగ్ అధికారులకు శిక్షణ అందించి పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు., పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు.ఆయా మండల కేంద్రాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో కౌంటర్లు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు యాస్మిన్ బాష మాట్లాడుతూ మొదటి విడత ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహర మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు, పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచ్ ఎన్నిక సజావుగా జరిగేలా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ లు లింగ్యా నాయక్ సుధీర్, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కవిత పై కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణ రావు విమర్శలు.

**కూకట్ పల్లి డిసెంబర్9( సమయం న్యూస్,) :**

నీలాంటి కుక్కలు మస్తు వచ్చినాయి నా దగ్గరికి.!

నీ సంగతి నీ మొగుని సంగతి ఏందో తెలియదా..!

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నీమీద దృష్టిపెడితే మొత్తం బయటపడతాయి అక్రమాలు...

అక్రమాలు సంపాదన గురించి నువ్వు మాట్లాడుతున్నావా..!

నిన్ను చూసి ఎవడు భయపడడు..!

మహాత్మా గాంధీ లాంటి మంచి పేరు ఉన్న నీ తండ్రి పరువుతీసినవ్..

ఆయన ప్రతిష్టను నాశనం చేసినావ్..!నివళ్ళనే అంతా నష్టం..!హైదరాబాద్ ను అభివృద్ధి పథంలో నడిపించిన కేటీఆర్ మీద విమర్శలు చేస్తావ్...

హరీష్ రావు ను పార్టీ నుండి వెళ్లగొట్టి.. కేటీఆర్ నుండి పార్టీని లాక్కోవడానికి నువ్వు చేస్తున్న కుట్ర ఎవనికి తెలియదు అనుకుంటున్నావ్..!ఇంకోసారి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదు..!ఈ మాటలన్నది ఎవరో కాదు.. బీఆర్ఎస్ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు..!కవితపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు..!

ఇటీవల కూకట్ పల్లి లో పర్యటించిన కవిత.. కృష్ణారావు పై తీవ్ర విమర్శలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో కవితకు కౌంటర్ గా ప్రెస్ మీట్ నిర్వహించిన కృష్ణారావు తీవ్ర పదజాలంతో కవిత దంపతులపై విరుచుకుపడ్డారు..!

కవితపై కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు..

# పోలింగ్ కేంద్ర్రాలను పరిశీలించిన అబ్జర్వర్ సీతాలక్ష్మి



**మద్దూరు మండలం, డిసెంబర్,09(సమయం న్యూస్) :** జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే కొడంగల్ నియోజకవర్గంలోని మద్దూరు మండలం దోరేపల్లి మండల పరిషత్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు సీతాలక్ష్మి పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు, కేంద్రాలలో విద్యుత్తు సౌకర్యం, ఓటర్లు వచ్చి ,వెళ్ళే దారులు, కేంద్రాల్లో ఓటర్లకు కల్పించాల్సిన వసతి సౌకర్యాలపై ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ నెల 11 న ఉదయం 7 గంటల నుంచి జిల్లాలోని కోస్గి, మద్దూరు, కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో వార్డు సభ్యుల, సర్పంచి స్థానాలకు పోలింగ్ జరగనుందని, కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.

# రాజకీయ పార్టీలు తాజా రాజ్యాంగం 30 రోజుల్లో సమర్పించాలి

భారత ఎన్నికల కమిషన్.

**న్యూ ఢిల్లీ, డిసెంబర్9( సమయం న్యూస్).:**భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు కీలక సూచన జారీ చేసింది. పార్టీలు తమ తాజా పార్టీ రాజ్యాంగం మరియు అందులో జరిగిన అన్ని సవరణల ప్రతులు తప్ప నిసరిగా 30 రోజుల్లోగా కమిషన్‌కు పంపాలని ఆదేశించింది.న్నికల సంఘం విడుదల చేసిన ప్రకటనలో పార్టీ నమోదు సమయంలో వారి రాజ్యాంగం లేదా నియమావళి సమ ర్పించటం చట్టపరమైన నిబంధన అని గుర్తు చేసింది. ప్రజాస్వామ్య పారదర్శకత కోసం పార్టీల రాజ్యాంగాలను ECI వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపింది.పార్టీలు తమ రాజ్యాంగంలో చేసే మార్పులు, సవరణలను కమిషన్‌కు వెంటనే తెలియజేయాలని, ఎన్నికల వ్యవస్థను బలోపేతం చేయడానికి రాజ్యాంగ నిబంధనలను కచ్చితంగా అనుసరించాల్సిన అవసరం ఉందని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించబోమ్

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య
- జోగిపేట ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్
- 11 మంది వైద్యులకు కి షోకాజ్ నోటిసులు జారీ



**సంగారెడ్డి ,డిసెంబర్ 09( సమయం న్యూస్).** ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడితే సహించేది లేదని, నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించక తప్పదని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య హెచ్చరించారు. మంగళవారం జోగిపేట ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె హాజరు రిజిస్టర్ ను పరిశీలించగా,పలువురు వైద్యులు విధులకు హాజరు కాకపోవడం పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన వైద్యులు ,సిబ్బంది వివరాలను, డిప్యూటేషన్‌పై ఉన్న సిబ్బంది వివరాలను కలెక్టర్ ఆరా తీసారు. విధులకు గైరుహాజరైన 11 మంది వైద్యులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డి సి హెచ్ ఓ ను ఆదేశించారు. ఓపి, డయాలసిస్, ఐసియు తో సహా అన్ని విభాగాలను ఆమె పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలు, పరికరాల వినియోగం, శుభ్రత, మందుల లభ్యత వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు .ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న కొంతమంది రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రులలో పేద ,మధ్యతరగతి కుటుంబాలకు ఎలాంటి ఆర్థిక భారం లేకుండా మెరుగైన వైద్య చికిత్సలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నావ న్నారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి పాండు, తహసీల్దార్ మధుకర్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలంతా సహకరించాలి

- కోస్గి సీఐ సైదులు
- ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరు పాటించాలి.
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు



**మద్దూరు మండలం, డిసెంబర్,09(సమయం న్యూస్) :** మంగళవారం కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్‌కుమార్ లు కలిసి ఖాజీపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తిగా ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు తెలియజేశారు. అధికారులు గ్రామస్తులకు ఇచ్చిన సూచనలు:ఎలాంటి ప్రలోభాలకు, డబ్బు, మద్యం పంపిణీకి లోనుకాకుండా చట్టపరమైన అవగాహనతో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు, అనుమానాస్పద చలనం ఏమైనా గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను సూచించారు.ఎన్నికల సమయంలో అమలులో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను అందరూ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, ద్వేషపూరిత పోస్టులు పెట్టడం కఠిన చట్టపరమైన చర్యలకు గురి చేస్తుందని హెచ్చరించారు.సీఐ సైదులు మాట్లాడుతూ,ఎన్నికలు ప్రజాస్వామ్య పండుగ. ప్రతి ఒక్కరి సహకారం ఉంటేనే పూర్తిగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయి. పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే తెలియజేయండి" అని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అలర్ట్ గా ఉండాలి..విస్తృత తనిఖీ లు చేపట్టండి

- విస్తృత తనిఖీ లు చేపట్టండి
- ఎన్నికల ప్రవర్తన నియమావలి ఉల్లాంఘన కాకూడదు
- ఎన్నికల అబ్సర్వర్ రవి కిరణ్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం డిసెంబర్9( సమయం న్యూస్)** :ఎన్నికలను పారదర్శకం గా నిష్పాక్షికంగా నిర్వహించడంలో FST, SST బృందాల పాత్ర కీలకంగా ఉంటుందని జనరల్ అబ్సర్వర్ రవి కిరణ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారుఎన్నికల ప్రవర్తన నియమావలి అమలు పైన FST, SST బృందాలు,తహసీల్దార్ లతో మంగళ వారం కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో ఎన్నికల అబ్సర్వర్, జిల్లా కలెక్టర్ సమీక్షించారుఈ సందర్భంగా ఎన్నికల అబ్సర్వర్ మాట్లాడుతూ...పోలింగ్ సమయంలో నగదు, మద్యం తదితర వాటిని చూపెట్టి ఓటర్లను ప్రలోబాలకు గురి చేయకుండా... పోలింగ్ అయిపోయే వరకు అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు

ఎన్నికల ప్రవర్తన నియమావళి సజావుగా అమలు కావాలంటే ఎఫ్ ఎస్ టి, ఎస్ ఎస్ టి బృందాలు క్షేత్ర స్థాయి లో విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారుఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కాకుండా చూడాలని... లా అండ్ ఆర్డర్ సమస్య లు ఎక్కడ రావద్దని..ఈరోజు రేపు ఎక్కువ నిఘా పెట్టాలన్నారుFST, SSTబృందాలు.. తనిఖీలు ముమ్మరం చేయాలని.. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారుప్రచార సమయం అయోగానే ఎక్కడ మీటింగ్ లు జరగకుండా చూడాలన్నారుMCC ఆంక్షల మీద గ్రామ పంచాయతీ లలో టామ్ టామ్ వేపించాలన్నారు ఉప సర్పంచ్ ఎన్నిక అయిపోయంత వరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలను పక్కాగా పాటించాలన్నారుఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమణ సంబంధిత ఫిర్యాదులు, బెదిరింపులు, మద్యం పంపిణీసంఘ విద్రోహ చర్యలు, పరిమితిని మించి ధనాన్ని వ్యయం చేయడం తదితర అంశాలను ఈ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిశితం గా పరిశీలించాలన్నారు ఎక్కడైనా ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమిస్తున్నట్లు సమాచారం అందగానే వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు ఈ రివ్యూ లో ఏసీపీ పండరి చేతన్, MCC నోడల్ ఆఫీసర్ విక్రమ్, తహసీల్దార్ లు, పోలీస్ అధికారులు పాల్గొన్నారుసమావేశ అనంతరం.. రఘునాథ్ పల్లి మండలం లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అబ్సర్వర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, డీసీపీ పరిశీలించారు పోలింగ్ స్టేషన్ లలో చేసిన ఏర్పాట్లను పరిశీలించి.... సంబంధిత అధికారులకు పలు సూచనలను తెలియజేసారు

# అవినీతి నిర్మూల పై పోస్టర్ విడుదల

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి డిసెంబర్9( సమయం న్యూస్) :** ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, నైతికతను పెంపొందించడం ద్వారా అవినీతి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా అవినీతి నిరోధక శాఖ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవినీతి నిర్మూలన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిర్మూలన వారోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పొందే ప్రతి పౌరుడు అవినీతి విషయమై జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అవినీతి ఘటనలు గమనించినప్పుడు వెంటనే అవినీతి నిరోధక శాఖకు వ తెలియచేయాలని సూచించారు. పారదర్శక పరిపాలనకు ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి తాను చేయాల్సిన ప్రభుత్వ సేవలకు లంచం అడిగితే ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎసిబి డిఎస్పీ సాంబయ్య, సిఐ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మీడియా సెంటర్ ను సందర్శించిన డి జి పి



**ఫ్యూచర్ సిటీ డిసెంబర్9( సమయం న్యూస్) :** ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను డిజిపి శివధర్ రెడ్డి నేడు సందర్శించారు. గ్లోబల్ సమ్మిట్ వివరాలను ఎప్పటికప్పుడు వివిధ ప్రచారమాధ్యమాల ద్వారా ప్రజలకు అందిస్తున్న మీడియా ప్రతినిధులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సెంటర్లో మీడియా ప్రతినిధుల సౌకర్యార్థం కంప్యూటర్లు, స్కానర్లు ,జిరాక్స్, వైఫైతో సహా ఎప్పటికప్పుడు సమ్మిట్ వివరాల ను అందించేందుకు చేసిన ఏర్పాట్లను డిజిపి కి సమాచారం శాఖ అధికారులు వివరించారు ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో, మీడియా సెంటర్లతో చేసిన ఏర్పాట్లను వాకప్ చేశారు.మీడియా సెంటర్ ఏర్పాట్లపై సమాచార శాఖ అధికారులను అభినందించారు.

# ఓటు హక్కు వినియోగం పై కళాజతర..



**భూపాల పల్లి డిసెంబర్( సమయం న్యూస్) :** 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు – ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులుజిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం గణపురం మండలం, చెల్పూర్ లో 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు నేపథ్యంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో ఓటు హక్కు వినియోగంపై టి.ఎస్.ఎస్. కళాకారులు కళాజాత కార్యక్రమాలు నిర్వహించారు.కళాజాతల ద్వారా ప్రజలకు ఓటు హక్కు ప్రాముఖ్యత, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో ప్రతి ఓటరు ఓటు హక్కు విజయోగించుకోవాలని సందేశాన్ని అందించారు. ప్రతి అర్హత ఉన్న పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించి ప్రజాస్వామ్యానికి బలం చేకూర్చాలని, ఎన్నికలను నిర్దిష్ట నియమావళి ప్రకారం శాంతియుతంగా, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టిఎస్ ఎస్ కళాకారులు మైసా ఎర్రన్న, దుప్పటి రవి, ఎండి ఖలీల్ పాషా, కొండపర్తి స్వప్న, కంచర్ల శ్యామల, గడ్డం రజిత తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టులో గ్యాప్-2 రాతి నింపే పనులు ప్రారంభం

● పనులు ప్రారంభించే ముందు ఎంఈఐఎల్

● మరియు జలవనరుల శాఖ అధికారులు పూజలు నిర్వహిస్తారు

**పోలవరం, డిసెంబర్ 09( సమయం న్యూస్).:** పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు గ్యాప్–2లో మంగళవారం రాతి నింపే పనులు ప్రారంభం కావడంతో నిర్మాణ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. జలవనరుల శాఖ అధికారులు మరియు మేఘ ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) ప్రతినిధులు పనులను అధికారికంగా ప్రారంభించే ముందు నిర్మాణ స్థలంలో సాంప్రదాయ పూజా ఆచారాలను నిర్వహించారు. భూమి బలోపేతం మరియు స్థిరీకరణ తర్వాత గ్యాప్–2 దిగువ భాగంలో రాతి నింపే కార్యకలాపాలు ఇప్పటికే జరుగుతున్నాయి. మంగళవారం, వేడుక తర్వాత గ్యాప్–2 ఎగువ ప్రాంతంలో రాతి నింపే పనులు అధికారికంగా ప్రారంభించబడ్డాయి. ఈ సందర్భంగా జలవనరుల శాఖ డీఈఈలు డి. శ్రీనివాస్, వెంకటరమణ, ప్రేమ్ చంద్, ఎంఈఐఎల్ జనరల్ మేనేజర్ ఎ. గంగాధర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం పనులు ఖచ్చితంగా జరుగుతున్నాయని అన్నారు. నిర్ణీత సమయంలోపు పూర్తి అయ్యేలా ఈ ప్రాజెక్టును ప్రణాళికాబద్ధంగా మరియు క్రమపద్ధతిలో అమలు చేస్తున్నామని వారు పునరుద్ఘాటించారు. గ్యాప్–2 యొక్క ఎగువ భాగంలో భూమిని బలోపేతం చేయడం మరియు రాతి పనులు ప్రారంభమయ్యాయని, డయాఫ్రమ్ వాల్ యొక్క ఎగువ మరియు దిగువ వైపులా మట్టిని నింపే పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. గ్యాప్–1 లోని నిర్మాణ కార్యకలాపాలు కూడా ఆమోదించబడిన షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయని వారు తెలిపారు.

# పకడ్బందీ ఏర్పాట్లతో పంచాయితీ ఎన్నికలను సజావుగా నిర్వహిద్దాం

● వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్





**హన్మకొండ డిసెంబర్9( సమయం న్యూస్) :** పకడ్బందీ ఏర్పాట్ల నడుమ పంచాయితీ ఎన్నికలను సజావుగా నిర్వహించుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. మొదటి విడత గ్రామ పంచాయితీ ఎన్నికల పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులతో మంగళవారం వీడియో సమావేశాన్ని నిర్వహించారు. డిసిపిలు, ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా తొలి విడత గ్రామ పంచాయితీ ఎన్నికలు జరిగే పోలీస్ స్టేషన్ అధికారులతో ముచ్చటిస్తూ ఎన్నికలు ముందు, ఎన్నికల రోజు, ఓట్ల లెక్కింపు సమయంలో స్టేషన్ అధికారులు తీసుకుంటున్న బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎన్నికల రోజు, ఎన్నికలు అనంతరం నిర్వహించే బడే ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా తీసుకొవాల్సిన ముందస్తు బందోబస్తు ఏర్పాట్లు, అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బంది నియామకం, బ్యాలెట్ పత్రాల పంపిణీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన బందొబస్తు ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ అధికారులకు పలుసూచనలు చేసారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్మాట్లాడుతూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి పోలీస్ అధికారి సమన్వయంతో పనిచేయాల్సి వుంటుందని. ప్రధానంగా ఎన్నికల సమయంలో పోలీస్ అధికారులు గ్రామాల్లో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ, పోలీస్ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో గుంపులుగా లేకుండా జాగ్రత్త పడాలని, పోలీంగ్ కేంద్రాలోకి ఓటర్లు వచ్చి వేళ్ళే మార్గాలు కేవలం ఒక్కటే మార్గం వుండాల చూసుకోవాలని, ఏద్కెన సమస్య తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సమచారం ఇవ్వడంతో అదనపు పోలీసులను రప్పించుకోవాలని. పొలింగ్ సమయంలో ముగిసిన వెంటనే పోలింగ్ కేంద్రంలోని ఎవరిని అనుమతించకుండా, అప్పటి వరకు వున్న ఓటర్లను మాత్రమే ఓటేంసేందుకు అనుమతించాలని, పోలింగ్ పరసరాల్లో ప్రచారం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఓట్ల లెక్కింపు సమయంలో పోలీసులు మరింత అప్రమత్తం వుండాలని, ఓట్ల లెక్కింపు పూర్తయి సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డు సభ్యులు ఎన్నిక అయ్యే వరకు పోలీస్ బందోబస్తు నిర్వహించాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, కవిత, రాజమహేంద్ర నాయక్‌తో పాటు అదనపు డిసిపిలు, ఏసిపిలుపాల్గోన్నారు.

# ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు శివకుమార్ నాయుడు
- హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మొదటి విడత మండలాల్లో మూడో ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించిన
- ఎన్నికల పరిశీలకులు శివ కుమార్ నాయుడు కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ డిసెంబర్9 ( సమయం న్యూస్) :** గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గ్రామపంచాయతీ ఎన్నికల హనుమకొండ జిల్లా సాధారణ పరిశీలకులు శివకుమార్ నాయుడు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మొదటి విడత మండలాల్లో మూడో ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులతో కలసి ఎన్నికల పరిశీలకులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఈనెల 11న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించే భీమదేవరపల్లి ఎల్కతుర్తి కమలాపూర్ మండలాల్లో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి చేసామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను ఆర్వోలు వెళ్లి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ సామగ్రిని ఇప్పటికే ఆయా మండల కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. పోలింగ్ రోజున ఈ మూడు మండలాలకు సెలవు దినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ తనిఖీ చేయాలని ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లకు ఆదేశించినట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి, ఏర్పాట్లును పరిశీలించి వాటి నివేదికను అందజేయాలని అధికారులకు తెలియజేశామని సమావేశంలో జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడుకు వివరించారు. అనంతరం జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి ప్రతి వార్డు బ్యాలెట్ పేపర్ ను తనిఖీ చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లు సరిగా ఉన్నాయా లేదా అని చెక్ చేసుకోవాలని అన్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపునకు సరిపోను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లను చేయాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండ చర్యలు చేపట్టాలని, పోలింగ్ అనంతరం కౌంటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డిఆర్డిఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ రైస్ సరఫర గడువు లోగా పూర్తి చేయాలి

● కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● సిఎంఆర్ రైస్ డెలివరీ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, డిసెంబర్-09( సమయం న్యూస్) :** రబీ సీజన్ కి సంబంధించి సీఎంఆర్ రైస్ సరఫరాలో నాణ్యత ప్రమణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి. వేణు తో కలిసి సిఎంఆర్ రైస్ డెలివరీ పై సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్ల సంఘాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,లి రబీ సీజన్ కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ పూర్తి చేసి సకాలంలో అందించాలని, సీఎంఆర్ సరఫరాలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని, గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.జిల్లాలోని రైస్ మిల్లులలో ఎఫ్ సి ఐ నిబంధనల ప్రకారం రా రైస్, పాలిష్ రైస్ నాణ్యత లోపం వంటి సమస్యలు పరిష్కరించి ఎటువంటి సమస్యలు లేకుండా త్వరితగతిన సి.ఎం.ఆర్. ను గడువు లోగా పూర్తి చేయుటకు ఎఫ్.సి. ఐ అధికారులకు సూచించారు. రైస్ మిల్లర్లకు సంబంధించి రోజువారీగా రిజిస్టర్ నమోదు చేయాలని, గన్ని సంచుల కోతలు, నెంబర్స్ నమోదు ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్,ఎఫ్.సి. ఐ . డివిజనల్ మేనేజర్ రవి ప్రకాష్, మేనేజర్ ఎఫ్. సి . ఐ . క్వాలిటీ కంట్రోల్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి ప్రసవాలను పెంచాలి.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వి వాణిశ్రీ.



**పెద్ద పల్లి డిసెంబర్09( సమయం న్యూస్) :** ఈ రోజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఆశా నోడల్ సూపర్వైజర్ల నెలవారీ సమీక్షా సమావేశాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వి. వాణిశ్రీ గారు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ:ఆసుపత్రి ప్రసవాలను పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి ఫుల్ టర్మ్ గర్భిణీని తప్పనిసరిగా ట్రాక్ చేయాలని సూచించారు.ప్రతి గర్భిణితో కలిసి ప్రసవ ప్రణాళిక రూపొందించి, ప్రభుత్వ ఆసుపత్రులైన జీజీహెచ్ రామగుండం, డిహెచ్ పెద్దపల్లి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు సుల్తానాబాద్, మంథని లలోనే ప్రసవం జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక శిక్షణ పొందిన స్టాఫ్ నర్సులు, గైనకాలజీ నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు తగ్గిపోతే సహించేది లేదని స్పష్టం చేశారు.క్షయవ్యాధి లక్షణాలు (జ్వరం, బరువు తగ్గడం, మందులకు లొంగని దగ్గు) ఉన్నవారిని తెమడ పరీక్ష మరియు అవసరమైన ఎక్స్–రే స్క్రీనింగ్ చేయించాల్సిందిగా ఆదేశించారు.ఆంటీ మైక్రోబియల్ నిరోధకత నివారణకై చేతులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరం లేని యాంటీబయోటిక్స్ వాడరాదని సూచించారు. డాక్టర్లు సూచించినట్లు మందులను పూర్తి డోసుగా తీసుకోవాలని ప్రజలకు తెలిపాలన్నారు.త్వరలో ప్రారంభమయ్యే లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపయిన్ లో లెప్రసీ కేసులను గుర్తించడానికి చర్యలు తీసుకుని, ప్రజల్లో లెప్రసీ లక్షణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.30 ఏళ్లు పైబడిన వారందరికీ ఎన్ సి డి స్క్రీనింగ్ నిర్వహించి, వారి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. అధిక రక్తపోటు, మధుమేహం నిర్ధారణ అయిన వారికి డాక్టర్లు సూచించిన మందులు అందించాల్సిందిగా సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డా. ఆర్. రాజమౌళి, డా. బి. శ్రీరాములు, డా. కె.వి. సుధాకర్ రెడ్డి, వైద్య అధికారి డా. లక్ష్మీ భవాని, ఆశా నోడల్ ఆఫీసర్ సిహెచ్ఓ దయామని, ఆశా నోడల్ సూపర్వైజర్లు మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీలంకతో భారత్ ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్

### భారత మహిళల జట్టును ప్రకటించిన బీసీసీఐ
### కెప్టెన్‌గా వ్యవహరించనున్న హర్మన్‌ప్రీత్ కౌర్
### స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు

శ్రీలంక మహిళల జట్టుతో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారత మహిళల జట్టును బీసీసీఐ మంగళవారం (డిసెంబర్ 9) ప్రకటించింది. ఈ సిరీస్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా, స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనుంది. నవంబర్ 2న జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌ను గెలుచుకున్న భారత జట్టు అప్పటి నుంచి విరామం తీసుకుంది. కొంతమంది ఆటగాళ్ళు దేశీయ క్రికెట్‌లో చురుగ్గా ఉన్నప్పటికీ, చాలా మంది ఈ సమయాన్ని విశ్రాంతి తీసుకోవడానికి, తమను తాము రిఫ్రెష్ చేసుకోవడానికి ఉపయోగించుకున్నారు. ఇప్పుడు, శ్రీలంక జట్టు ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం భారతదేశాన్ని సందర్శిస్తున్నందున జట్టు విరామం త్వరలో ముగుస్తుంది. ఇది ప్రపంచ కప్ తర్వాత టీమ్ ఇండియాకు మొదటి సిరీస్ అవుతుంది. ఈ జట్టులో వన్డే ప్రపంచ కప్ గెలిచిన జట్టులో భాగమైన చాలా మంది క్రీడాకారిణులు కూడా ఉన్నారు. అయితే, అత్యంత ప్రముఖమైన పేరు స్మృతి మంధాన. మంధాన ఇటీవల తన వివాహాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది. నవంబర్ 23న పలాష్ ముచ్చల్‌ను వివాహం చేసుకోవాల్సి ఉంది. కానీ ఆ రోజు అది వాయిదా పడింది. ఆపై రెండు వారాల తర్వాత, మంధాన తన వివాహాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ఫలితంగా, ఈ పెద్ద వ్యక్తిగత ఎదురుదెబ్బ తర్వాత మంధాన వెంటనే మైదానంలోకి తిరిగి వస్తుందా లేదా విరామం తీసుకుంటుందా అనే దానిపై దృష్టి కేంద్రీకరించబడింది. అయితే, టీం ఇండియా వైస్-కెప్టెన్ తాను తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేసింది. సిరీస్ వివరాలు: భారత్, శ్రీలంక మహిళల జట్ల మధ్య మొత్తం 5 టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ సిరీస్ డిసెంబర్ 21న ప్రారంభమై డిసెంబర్ 30న ముగుస్తుంది. వేదికలు: విశాఖపట్నం, తిరువనంతపురం వేదికలుగా మ్యాచ్‌లు జరగనున్నాయి. జట్టు ఎంపిక: ఈ సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో హర్మన్‌ప్రీత్, స్మృతి మంధానతో పాటు షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ వంటి కీలక క్రీడాకారిణులు ఉన్నారు. వికెట్ కీపర్లుగా రిచా ఘోష్, జి. కమలిని ఎంపికయ్యారు. కొత్త ముఖాలుగా శ్రీ చరణి, వైష్ణవి శర్మ జట్టులో చోటు దక్కించుకున్నారు.

భారత మహిళల టీ20 జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, జెమిమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, స్నేహ రాణా, హర్లీన్ డియోల్, అమన్‌జోత్ కౌర్, అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్, రేణుకా సింగ్ ఠాకూర్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ.

# టీమిండియా కాంబినేషన్‌పై అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు



సౌతాఫ్రికాతో టీమిండియా బరిలోకి దిగే కాంబినేషన్‌పై అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 ప్రపంచకప్ 2026 కావాల్సిన కాంబినేషన్‌ను ఈ సిరీస్‌తో సెట్ చేసుకోవాలని సూచించాడు. ఈ సిరీస్‌లో భారత్ విజయం సాధించాలంటే ఐదుగురి ఆటగాళ్లను తప్పకుండా తుది జట్టులో ఆడించాలని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. 'శుభ్‌మన్ గిల్ రీఎంట్రీతో సంజూ శాంసన్ మూడో స్థానంలో ఆడుతాడా? లేదా? అనేది సందేహంగా మారింది. ఫస్ట్ డౌన్‌లో సూర్య లేదా తిలక్ వర్మను ఆడించవచ్చు. సంజూను మూడో స్థానంలో ఆడించాలి. కానీ శుభ్‌మన్ గిల్ రాకతో అతనికి అవకాశాలు సన్నగిల్లాయి. గతంలో ఓపెనర్ కమ్ కీపర్‌గా రాణించి సత్తా చాటిన సంజూకు జట్టులో చోటు లేని పరిస్థితి నెలకొంది. ఓపెనర్‌గా స్పెషలిస్ట్ బ్యాటర్ అయిన గిల్ ఎంట్రీతో.. మిడిలార్డర్‌లో ఆడే వికెట్ కీపర్ కమ్ ఫినిషర్ భారత జట్టుకు అవసరం ఉంది. ఈ సిరీస్ భారత బ్యాటర్ల పాత్రపై మేనేజ్‌మెంట్ స్పష్టతతో ఉంటుందని ఆశిస్తున్నా. భారత బ్యాటింగ్ లైనప్‌కు తగ్గట్లుగానే సౌతాఫ్రికా ఆడనుంది. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ గెలవగల సత్తా సౌతాఫ్రికాకు ఉందో లేదో ఈ సిరీస్‌తో తేలనుంది. అందుకే ఈ సిరీస్ కోసం నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. సౌతాఫ్రికా జట్టులో ప్రమాదకరమైన ఆటగాళ్లు ఎవరూ లేరు. కుల్దీప్, వరుణ్, బుమ్రా వంటి బౌలర్లు ఆ జట్టులో కనిపించడం లేదు. భారత్‌కు కూడా ఇది కీలకమైన సిరీస్. టీమ్‌కాంబినేషన్‌ను ఎంచుకోవాలి. ఇప్పటికే చాలా ప్రయోగాలు చేశారు. టీ20 జట్టులో స్థిరత్వం కీలకం. అర్ష్‌దీప్ సింగ్‌ను టీ20 జట్టులో కొనసాగిస్తారా? లేదా? అనేది కూడా తేల్చుకోవాలి. నా అభిప్రాయం ప్రకారం అతన్ని జట్టులో ఆడించాలి. వరుణ్, కుల్దీప్ యాదవ్ ఇద్దర్నీ ఆడించగలమో లేదో చూసుకోవాలి. మంచు ప్రభావం ఉంటే మూడో పేసర్‌ను తీసుకోవాలి. లేదంటే బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యాలు ఆడాలి. ఈ బౌలింగ్ దాడికి ప్రత్యర్థిని ఆలౌట్ చేయగల సామర్థ్యం ఉంది. ఈ బౌలర్లతో ఎంత స్కోర్‌నైనా కాపాడుకోవచ్చు. తొలి మ్యాచ్‌లో ఈ బౌలింగ్ లైనప్‌ను చూడాలని అనుకుంటున్నా. టీ20 ప్రపంచకప్ ముందు వరుణ్ చక్రవర్తి హిడెన్ టాలెంట్‌ను బయటపెట్టవద్దు. ప్రపంచకప్‌లోనే అతని అసలు అస్త్రాన్ని వాడాలి.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.

# భారత్ రికార్డు విజయం

## హార్దిక్ ఆల్‌రౌండ్ షో.. బౌలర్ల సమష్టి ప్రదర్శనతో సఫారీలు కుదేలు



కటక్ : సొంతగడ్డపై వచ్చే ఏడాది జరుగబోయే టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న భారత జట్టు.. మెగా టోర్నీ ప్రయాణాన్ని ఘనవిజయంతో ఆరంభించింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా మంగళవారం కటక్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో టీమ్‌ఇండియా.. 101 పరుగుల భారీ తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. బ్యాట్‌తో టాపార్డర్ నిరాశపరిచినా 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' హార్దిక్ పాండ్యా (28 బంతుల్లో 59 నాటౌట్, 6 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు. అతడి మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత ఓవర్లలో 175/6 స్కోరు చేసింది. ఛేదనలో దక్షిణాఫ్రికా.. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శనతో 12.3 ఓవర్లలో 74 రన్స్‌కే తోకముడిచింది. అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్, అక్షర్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇరుజట్ల మధ్య రెండో టీ20 ఈనెల 11న ముల్లాన్‌పూర్‌లో జరుగుతుంది.

### హార్దిక్ ధనాధన్

48/3. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ పవర్ ప్లేలో చేసిన స్కోరిది. టెస్టు, వన్డే సారథి శుభ్‌మన్ గిల్ (4), టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (12)తో



పాటు స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ (17) తీవ్రంగా నిరాశపరిచారు. ఎంగిడి వరుస ఓవర్లలో షాకులివ్వడంతో టీమ్‌ఇండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఈ దశలో హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ (26), అక్షర్ (23) కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 30 రన్స్ జోడించినా వేగంగా ఆడలేకపోయారు. అయితే 12వ ఓవర్లో తిలక్ ఔట్ అవడంతో క్రీజులోకి వచ్చిన హార్దిక్.. ఆరంభం నుంచే సఫారీ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. మహారాజ్ బౌలింగ్‌లో రెండు భారీ సిక్సర్లు బాదిన అతడు.. నోకియా బౌలింగ్‌లో రెండు బౌండరీలు కొట్టాడు. అక్షర్ నిష్క్రమించినా ఆఖర్లో దూబె (11), జితేశ్ శర్మ (10లి)తో కలిసి భారత్‌కు భారీ స్కోరునందించాడు. సిపమ్ల ఓవర్లో అతడు 18 పరుగులు రాబట్టగా నోకియా ఆఖరి ఓవర్లోనూ 12 రన్స్ వచ్చాయి.

### పెవిలియన్‌కు సఫారీల క్యూ

ఛేదనలో తొలి ఓవర్లోనే డికాక్ వికెట్ కోల్పోయిన సఫారీలు.. ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. అర్ష్‌దీప్ వరుస ఓవర్లలో డికాక్, స్టబ్స్‌ను ఔట్ చేసి సౌతాఫ్రికా వికెట్ల పతనాన్ని మొదలెట్టగా స్పిన్నర్లు అక్షర్ (2/7), వరుణ్ (2/19) రాకతో సఫారీ బ్యాటర్ల పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆరో ఓవర్లో బంతినందుకున్న అక్షర్.. తొలి బంతికే సఫారీ సారథి మార్క్మ్ (14)ను బౌల్డ్ చేశాడు. మరుసటి ఓవర్లో మిల్లర్ (1)ను హార్దిక్ బోల్తా కొట్టించగా వరుణ్.. ఫెరీరా (5)ను పెవిలియన్‌కు పంపాడు. యాన్సెన్ (12)ను వరుణ్ పదో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ చేయగా బుమ్రా ఒకే ఓవర్లో బ్రెవిస్ (22), మహారాజ్‌ను ఔట్ చేసి సఫారీల ఓటమిని ఖరారుచేశాడు. దూబే 13వ ఓవర్లో సిపమ్ల (2)ను ఔట్ చేసి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

ఈ మ్యాచ్‌లో బ్రెవిస్ వికెట్ తీయడం ద్వారా టీ20ల్లో వంద వికెట్ల ఘనతను పూర్తిచేసిన బుమ్రా.. భారత్ తరఫున మూడు ఫార్మాట్లలోనూ 100 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా నిలిచాడు.

టీ20ల్లో దక్షిణాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోరు.

### సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 175/6 (హార్దిక్ 59లి, తిలక్ 26, ఎంగిడి 3/31, సిపమ్ల 2/38)

దక్షిణాఫ్రికా: 12.3 ఓవర్లలో 74 ఆలౌట్ (బ్రెవిస్ 22, స్టబ్స్ 14, అక్షర్ 2/7, అర్ష్‌దీప్ 2/14)

## మీడియాపై మండిపడ్డ హార్దిక్ పాండ్యా..!



హార్దిక్ పాండ్యా గర్ల్‌ఫ్రెండ్ అయిన మహికా శర్మ.. ముంబై లోని భద్ర నుంచి..మెట్లు దిగుతూ బయటకు వస్తుండగా అక్కడ ఉన్న ఫోటోగ్రాఫర్లు.. అసౌకర్యంగా వీడియోలు తీశారు. ఆ వీడియోలు చూసిన.. హార్దిక్ చాలా బాధపడ్డారు. తాను కెమెరాలకు అ ల ఎ ా ట ం పడిపోయానని..కానీ ఓ మహిళను అలా అసభ్యంగా చిత్రీకరించడం సరైంది కాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై హార్దిక్ తన అభిప్రాయాన్ని ఇంస్టాగ్రామ్.. ద్వారా పంచుకున్నారు. ప్రజల్లో ఉన్నవారిని మీడియా ప్రశ్నించడం. .ఫోటోలు తీయడం సహజమే అని చెప్పారు. కానీ లైమ్‌లైట్ కోసం ఒక మహిళ గౌరవాన్ని దెబ్బతీయడం.. తాను అస్సలు ఒప్పుకోనని అన్నారు. ప్రతి మహిళకు గౌరవం.. వ్యక్తిగత స్పేస్.. ఉండాల్సిందేనని ఆయన గట్టిగా చెప్పారు. హార్దిక్..మహీకా ప్రేమను 2025 అక్టోబర్‌లో అధికారికంగా ప్రకటించారు. అంతకుముందే సోషల్ మీడియాలో వాళ్ల ట్రావెల్ ఫోటోలు, కామెంట్లు చూసి అభిమానులు అనుమానం వ్యక్తం చేశారు. తర్వాత హార్దిక్ తన పుట్టినరోజు ముందు బీచ్ ట్రిప్..పూజ ఫోటోలతో సంబంధాన్ని ఖరారు చేశారు. మహీకా శర్మ 24 ఏళ్ల.. యువ మోడల్. ఆమె యోగా ట్రైనర్‌గా కూడా పనిచేస్తోంది. ఫ్యాషన్ డిజైనర్లతో పని చేసింది. ఎకనామిక్స్, ఫైనాన్స్‌లో చదువుకుని డిగ్రీ కూడా పొందింది. వీరిద్దరి ప్రేమకు అభిమానులు సోషల్ మీడియాలో మంచి మద్దతు ఇస్తున్నారు. ఇటీవల మహీకా చేతికి పెద్ద ఉంగరం కనిపించడంతో నిశ్చితార్థం వార్తలు కూడా వినిపించాయి. అయితే తాను కేవలం ఆభరణాలు ఇష్టపడతానని ఆమె నవ్వుతూ ఆ వార్తలకు చెక్ పెట్టింది.

## ఐపీఎల్ వేలం కోసం ఎంపికైన 350 మంది ఆటగాళ్ళు




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్ కోసం జరిగే మినీ వేలంలో మొత్తం 350 మంది ఆటగాళ్లను షార్ట్‌లిస్ట్ చేశారు. బీసీసీఐ వారి జాబితాను విడుదల చేసింది. ఇందులో 16 మంది క్యాప్డ్ భారతీయ ఆటగాళ్లు, 96 మంది క్యాప్డ్ విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. 224 మంది అన్‌క్యాప్డ్ భారతీయ ఆటగాళ్లు. 14 మంది అన్‌క్యాప్డ్ విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. మొదటి సెట్‌లో కామెరూన్ గ్రీన్, సర్ఫరాజ్ ఖాన్, డేవిడ్ మిల్లర్, పృథ్వీ షా వంటి పెద్ద ఆటగాళ్లు ఉంటారు. బేస్ ధరను పరిశీలిస్తే, మొత్తం 350 మంది ఆటగాళ్లు 8 వేర్వేరు కేటగిరీల్లో ఉన్నారు. అత్యధిక బేస్ ధర రూ. 2 కోట్లు, ఇందులో 40 మంది ఆటగాళ్లు ఉన్నారు. అత్యల్ప బేస్ ధర రూ. 30 లక్షలు, ఇందులో అత్యధికంగా 227 మంది ఆటగాళ్లు ఉన్నారు.ఐపీఎల్ 2026 వేలం డిసెంబర్ 16న అబుదాబిలో జరుగుతుంది. వేలం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతుంది.

# నాకు ప్రశాంతత అంటే అది కాదు!

## స్మృతి మంధాన ఆసక్తికర పోస్టు



టీమ్ఇండియా క్రికెటర్ స్మృతి మంధాన పెళ్లి రద్దు చేసుకున్న మరుసటిరోజే ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ షేర్ చేసింది. ఈ పోస్టుకు ఆసక్తికరమైన క్యాప్షన్ రాసుకొచ్చింది. దీంతో ఈ క్యాప్షన్ అందర్నీ ఆకర్షిస్తోంది.పలాశ్ ముచ్చల్‌తో వెడ్డింగ్ క్యాన్సిల్ చేసుకుంటున్నట్లు అదివారం ప్రకటన చేసిన మంధాన, మరుసటి రోజే సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసింది. అయితే ఈ పోస్ట్ ప్రమోషన్‌కు సంబంధించింది. ఓ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్న ఆమె ఎండార్స్‌మెంట్‌కు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌లో పోస్ట్ చేసింది. ఈ పోస్ట్‌కు "నాకు ప్రశాంతత అంటే మౌనం కాదు, నియంత్రణ" అంటూ రాసుకొచ్చింది. దీంతో ఈ క్యాప్షన్ అందర్నీ ఆకర్షిస్తుంది. ఆమె లైఫ్‌లో ప్రస్తుత పరిస్థితిని ఉద్దేశించే ఇలా రాసిందంటూ ఫ్యాన్స్ అంటున్నారు. అలాగే జరిగింది మర్చిపోయి, ముందుకు సాగుతూ కెరీర్‌లో ఇంకెంతో సాధించాలంటూ కామెంట్ చేస్తున్నారు.అయితే మ్యూజిక్ డైరెక్టర్ పలాశ్ ముచ్చల్‌తో తన వివాహం రద్దు చేసుకున్నట్లు రీసెంట్‌గా మంధాన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేసింది. "గత కొన్ని వారాలుగా నా జీవితం చుట్టూ చాలా ఊహాగానాలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో నేను మాట్లాడటం ముఖ్యమని భావిస్తున్నా. నా గురించి అన్నీ గోప్యంగా ఉండాలని భావించే వ్యక్తిని నేను. కానీ, వివాహం రద్దయిందని స్పష్టం చేయాలనుకుంటున్నా. ఈ విషయాన్ని ఇక్కడితో మంగిస్తారని భావిస్తున్నా. రెండు కుటుంబాల గోప్యతను గౌరవించి ముందుకు సాగేందుకు స్పేస్ ఇవ్వాలని కోరుతున్నా. భారత్ తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడి ట్రోఫీలు గెలిచేలా కృషి చేస్తా. మీ అందరి మద్దతుకు ధన్యవాదాలు. ముందుకు సాగవలసిన సమయం ఇది" అని మంధాన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాసుకొచ్చింది. "నేను జీవితంలో ముందుకు వెళ్లాలని నిశ్చయించుకున్నాను. ఆధారాల్లేని వదంతులను ఈజీగా నమ్మకూడదని కోరుతున్నా. ఇది నా జీవితంలో అత్యంత కష్టసమయం. ఆధారాల్లేని ఈ వదంతులు వ్యాప్తి చేసేముందు ముందు ఒక్కసారి ఆలోచించాలి. ఇలాంటి అంశాల్లో మన మాటలు అవతలి వ్యక్తిని బాధిస్తాయనే విషయాన్ని గుర్తించి అర్థం చేసుకోవాలి. నా ప్రతిష్ఠకు భంగం కలిగించే, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై మా లీగల్ టీమ్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుంది. ఈ కష్ట సమయంలో నాకు అండగా నిలిచినవారికి ధన్యవాదాలు" అని పలాశ్ మచ్చల్ తన ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు. కాగా, ఈ ఇద్దరి పెళ్లి గతనెల 23న జరగాల్సింది. కానీ, ఆ రోజు మంధాన తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురవ్వడంతో పెళ్లి వాయిదా పడింది. ఆ తర్వాత స్మృతిని కించపరుస్తూ పలాశ్ ఇంకో అమ్మాయితో చనువుగా చాటింగ్ చేశాడని ఆరోపిస్తూ కొన్ని స్క్రీన్ షాట్లు వైరల్ అయ్యాయి. దీనిపై ఇరు కుటుంబాలు స్పందించలేదు. అనంతరం తమ పెళ్లి రద్దు చేసుకున్నట్లు మంధాన-పలాశ్ వేర్వేరుగా ప్రకటన విడుదల చేశారు.

# కథతో వస్తే సినిమాతో వెళ్లొచ్చు

## పరిశ్రమకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తాం

## ఫ్యూచర్ సిటీలో స్టూడియోల ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం

## ఇరవై నాలుగు విభాగాల్లో స్థానికులకు శిక్షణ ఇవ్వాలి

## సినీ ప్రముఖులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి





తెలంగాణలో సినీ పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేవలం కథతో వస్తే చాలు, సినిమాను పూర్తి చేసుకుని వెళ్లేలా అన్ని హంగులూ సమకూరుస్తామని ఆయన పరిశ్రమ వర్గాలకు భరోసా ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ వేదికగా మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు టాలీవుడ్, బాలీవుడ్ సినీ ప్రముఖులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొస్తే ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సినిమా రంగానికి సంబంధించిన ఇరవై నాలుగు విభాగాల్లో స్థానిక యువతకు ఈ యూనివర్సిటీ ద్వారా శిక్షణ ఇప్పించే అంశాన్ని పరిశీలించాలని ఆయన సినీ పెద్దలకు సూచించారు. దీనివల్ల పరిశ్రమకు నైపుణ్యం కలిగిన సిబ్బంది దొరకడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో సినిమాలు నిర్మించేందుకు తమ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, నటీమణులు జెనీలియా, అక్కినేని అమల తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

## అఖండ 2 విడుదలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్..



ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో అఖండ 2 ఒకటి. భారీ అంచనాల మధ్య రూపొందించిన ఈ సినిమా విడుదల కోసం నందమూరి ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నందమూరి బాలకృష్ణ హీరో డైరెక్టర్ బోయపాటి శ్రీను ఈ మూవీని రూపొందించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్ సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేశాయి. ఇందులో బాలయ్య నట విశ్వరూపం చూపించనున్నారని ముందు నుంచి పోస్టర్స్, టీజర్ పై బజ్ క్రియేట్ చేశారు మేకర్స్. డిసెంబర్ 5న ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. అప్పటికే బాలయ్యతోపాటు చిత్రయూనిట్ సైతం జోరుగా ప్రమోషన్స్ నిర్వహించారు. కానీ చివరి క్షణంలో ఈ సినిమా విడుదలను వాయిదా వేశారు. ఫైనాన్షియల్ వివాదాల కారణంగా ఈ సినిమా రిలీజ్ అగిపోయింది. 14 రీల్స్ ఎంటర్టైన్మెంట్స్ నుంచి తమకు రావాల్సిన రూ. 28 కోట్ల బకాయిని చెల్లించేవరకు అఖండ 2 సినిమాను నిలిపివేయాలని బాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈరోస్ ఇంటర్నేషనల్ మద్రాసు హైకోర్టును ఆశ్రయించింది. ఈరోస్ వాదనలతో ఏకీభవించిన కోర్టు అఖండ2 సినిమాపై స్టే విధించింది. ఇప్పుడు సినిమాకు సంబంధించిన ఫైనాన్షియల్ సమస్యలు అన్ని క్లియర్ అయ్యాయి. దీంతో అఖండ 2 సినిమా విడుదలకు మద్రాసు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలని భావిస్తున్నారట మేకర్స్. ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం అఖండ 2 చిత్రాన్ని డిసెంబర్ 12న రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. రెండు తెలుగు రాష్ట్రాల్లో డిసెంబర్ 11న రాత్రి నుంచి ప్రీమియర్ షోలు పడనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ సినిమా విడుదల పై అధికారిక ప్రకటన రానున్నట్లు తెలుస్తోంది . ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా.. తమన్ సంగీతం అందిస్తున్నారు.

## నారి నారి నడుమ మురారి' సంక్రాంతి రిలీజ్ కి రెడీ



శర్వానంద్ 'నారి నారి నడుమ మురారి' సంక్రాంతి రిలీజ్ కి రెడీ అయ్యింది. సామజవరగమన ఫేం రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాని అనిల్ సుంకర నిర్మించారు. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలు. ఈ సినిమా రిలీజ్ టైం లాక్ చేశారు. ఈ సంక్రాంతికి జనవరి 14న సినిమా విడుదల కానుంది. ప్రీమియర్ షో సమయం – సాయంత్రం 5:49. సాధారణంగా సినిమాలు ఉదయం లేదా తెల్లవారుజామున షోలతో ప్రారంభమవుతాయి. ఈ సినిమా సాయంత్రం రిలీజ్ ని ఎంచుకుంది శర్వానంద్ నటించిన శతమానం భవతి, ఎక్స్‌ప్రెస్ రాజా చిత్రాలు జనవరి 14న విడుదలయ్యాయి. ఆరకంగా ఈ సినిమాకి పాజిటివ్ సెంటిమెంట్ వుంది. ఈ పండుగకి చాలా పోటీ వుంది. పండగ చివర్లో సినిమాకు కాస్త పోటీ తగ్గుతుంది, సెలవలు కూడా మిగిలే ఉంటాయనే ఆలోచనలో వుంది టీమ్. అందుకే సాయంత్రం ఆటలతో సినిమా మొదలుపెడుతున్నారు. రామ్ అబ్బరాజు మంచి ఫ్యామిలీ టచ్ వున్న సినిమాలు తీసే దర్శకుడు. సామజవరగమన చిత్రానికి పని చేసిన నందు భాను ఈ టీమ్ లోనూ ఉన్నారు. ఇది పక్కగా పండగకి రావాల్సిన సినిమా అని దర్శక నిర్మాతల నమ్మకం. అందుకే ఇంతపోటీలోనూ కూడా వదులుతున్నారు.

## 'మోగ్లీ' సినిమా దర్శకుడికి అండగా సాయి ధరం తేజ్





బాలకృష్ణ 'అఖండ 2' అనుకున్న టైమ్ రిలీజ్ అయి ఉంటే ఈ వారం దాదాపు 15 కొత్త సినిమాలు థియేటర్లలో రిలీజ్ అయ్యేవి. అయితే అఖండ 2 మూవీ అనూహ్యంగా వాయిదా పడడం, రిలీజ్ డేట్ పై ఇంకా క్లారిటీ రాకపోవడంతో ఈ వారం సినిమాల రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. ఒకవేళ 'అఖండ 2' డిసెంబరు 12న బాక్సాఫీసు ముందుకు వస్తే.. ఆ రోజు విడుదలయ్యేందుకు సిద్ధమైన పలు సినిమాలు వాయిదా పడే అవకాశాలున్నాయి. అందులో సుమ కుమారుడు రోషన్ హీరోగా నటించిన మోగ్లీ కూడా ఉంది. కలర్ ఫొటోతో జాతీయ అవార్డు అందుకున్న సందీప్ రాజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించాడు. చాలా రోజులుగా కష్టపడి తెరకెక్కించిన మోగ్లీ సినిమా వాయిదా పడే అవకాశాలుండడంతో ఈ ట్యాలెంటెడ్ డైరెక్టర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. 'సినిమాపై ఎంతో ప్యాషన్ ఉన్న వ్యక్తులు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. కలర్ ఫొటో, మోగ్లీ ఈ ఈ రెండు సినిమాలకు సంబంధించి రెండు కామన్ పాయింట్స్ ఏంటంటే.. 1. అంతా సవ్యంగానే జరుగుతోందని అనుకుంటే.. విడుదల విషయంలో దురదృష్టం ఎదురవడం. 2. నేను. నాదే 'బ్యాడ్‌లక్' అనుకుంటున్నా.. 'డైరెక్టెడ్ బై సందీప్‌రాజ్' అని సిల్వర్ స్క్రీన్ పై నా పేరు చూసుకోవాలన్న కల రోజు రోజుకూ కష్టతరమవుతోంది. . రోషన్, సరోజ్, సాక్షి, హర్ష, డీవోపీ మారుతి, మ్యూజిక్ డైరెక్టర్ కాల భైరవ.. ఇలా అంకిత భావం ఉన్న ఎంతోమంది కష్టంతో 'మోగ్లీ' రూపొందింది. వారి కోసమైనా ఈ సినిమా విషయంలో మంచి జరగాలని ఆశిస్తున్నా' అని తన ఆవేదనకు అక్షర రూపమిచ్చారు సందీప్ రాజ్. కాగా సందీప్ ట్వీట్‌పై మెగా హీరో సాయి దుర్గాతేజ్‌స్పందించారు. 'డియర్ సందీప్.. మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఊహించని విధంగా దక్కుతుంది. ధైర్యంగా ఉండండి. మీ విషయంలో మీరు గర్వపడండి. చివరకు సినిమా గెలుస్తుంది' అని సందీప్ కు భరోసా ఇచ్చాడు సాయి దుర్గాతేజ్. ఇక బేబీ నిర్మాత ఎస్కేఎన్ స్పందిస్తూ.. 'డియర్ సందీప్.. జాతీయ అవార్డు చిత్రం 'కలర్ ఫొటో'లో మీరు ఒక భాగం. ఈ అడ్డంకులన్నీ తాత్కాలికం. దిగులు పడొద్దు. మీ కష్టాన్ని ప్రేక్షకులు గుర్తిస్తారు, మద్దతు ఇస్తారు. ఆల్ ది బెస్ట్' అని విషెస్ చెప్పారు.



## ఉస్తాద్' పాటలపై ఫ్యాన్స్ ఆసక్తి

పవన్ కల్యాణ్ తో దేవిశ్రీ ప్రసాద్ కాంబో ఎప్పుడూ మిస్‌ఫైర్ కాలేదు. 'జల్సా' పాటలన్నీ సూపర్ హిట్టే. 'గబ్బర్ సింగ్' అయితే.. ఇక చెప్పాల్సిన పనిలేదు. 'సర్దార్ గబ్బర్ సింగ్' సినిమా ఫ్లాప్ అయినా, ఆల్బమ్ మాత్రం నిరుత్సాహ పరచలేదు. ఇప్పుడు మరోసారి వీరి కాంబోని చూసే ఛాన్స్ దక్కింది. 'ఉస్తాద్ భగత్‌సింగ్' తో. హరిష్ శంకర్‌కు మ్యూజిక్ విషయంలో మంచి టేస్ట్ వుంది. తన సినిమాల్లో పాటలన్నీ బాగుంటాయి. పైగా డీఎస్‌పీతో మంచి రాపో ఉంది. అందుకే 'ఉస్తాద్' లో పాటలెలా ఉంటాయో అని ఫ్యాన్స్ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఉస్తాద్ నుంచి ఫస్ట్ సింగిల్ గా 'దేఖ్‌లేంగే' రాబోతోంది. ఈరోజు ప్రోమో వదిలారు. 'స్టెప్పేస్తే భూకంపం' అనే హుక్ లైన్ తో ప్రోమో వదిలారు. ఆ కాసేపటి ప్రోమోకే పవన్ ఫ్యాన్స్ ఖుషీ అయిపోతున్నారు. పవన్ లుక్, గ్రేస్, డ్రస్సింగ్ ఇవన్నీ ఫ్యాన్స్‌కి బాగా నచ్చేశాయి. పవన్ పై తన అభిమానాన్ని దేవిశ్రీ మరోసారి ఈ సినిమాతో చాటుకోబోతున్నాడని అనిపిస్తోంది. ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో కూడా -ఉస్తాద్ ఆల్బమ్ గురించి ప్రస్తావించాడు దేవిశ్రీ. ఈ సినిమాలో పాటలు అదిరిపోయాయని, తాను ఓ పాట చూశానని, వన్స్ మోర్ అనాలనిపించేలా ఈ పాటన్ని డిజైన్ చేశారని, పవన్ కూడా చాలా కాలం తరవాత స్టెప్పులేయాలన్న ఉత్సాహం చూపించారని చెప్పుకొచ్చాడు దేవి. బహుశా.. ఈ పాటలోనే పవన్ శ్రద్ధగా స్టెప్పులేశారేమో అనిపిస్తోంది. సాధారణంగా ఆల్బమ్ లోని ది బెస్ట్ సాంగ్ నే ఫస్ట్ సింగిల్ గా వదులుతుంటారు. ఈ ఆల్బమ్ లోని బెస్ట్ సాంగ్ కూడా ఇదే అనిపిస్తోంది. ఈనెల 13న పూర్తి పాట బయటకు రాబోతోంది. ఆ రోజు హైదరాబాద్ లో ఓ ఈవెంట్ నిర్వహించే ఛాన్స్ వుంది. మార్చిలో -ఉస్తాద్‌ని రిలీజ్ చేసే ప్లానింగ్ లో ఉన్నారు నిర్మాతలు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**